Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered
with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారం

విలేఖరులు కావలెను
రాజమండ్రి, చాగల్లు,
నిడదవోలు,
దేవరపల్లి మండలాలకు
విలేకరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్: 9100986584, 9553574250


RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 194 విశాఖపట్నం, 15 మే 2025 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణస్వీకారం



**ఢిల్లీ:** సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రితోపాటు, కేంద్ర మంత్రులు, ఇతర అతిథుల సమక్షంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆయనకు అభినందనలు తెలిపారు. 2019 మే 24 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న ఆయన అనేక రాజ్యాంగ ధర్మాసనాల్లో సభ్యుడిగా చరిత్రాత్మక తీర్పుల్ని వెలువరించారు. సీజేఐగా ఆరు నెలలు కొనసాగి నవంబరు 23న పదవీవిరమణ చేస్తారు. సీజేఐ పీఠాన్ని అధిరోహించిన రెండో దళిత వ్యక్తిగా గవాయ్‌గా పేరు పొందారు.

మహారాష్ట్రలోని అమరావతిలో 1960 నవంబరు 24న జన్మించిన గవాయ్ 1985 మార్చి 16న న్యాయవాదిగా వృత్తి జీవితం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. 2003 నవంబరు 14న బాంబే హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ గవాయ్ 2005 నవంబరు 12న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొంది ఆ హైకోర్టు ప్రధాన ధర్మాసనం ఉన్న ముంబయితో పాటు, నాగ్‌పుర్, ఔరంగాబాద్, పనాజీ ధర్మాసనాల్లో సేవలందించారు. 2019 మే 24న ...(మిగతా 2లో)



## రాష్ట్రపతితో త్రివిధ దళాధిపతుల భేటీ

ఢిల్లీ: భారత రాష్ట్రప్రతి ద్రౌపదీ ముర్ముతో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాదిపతులు భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ బలగాలు ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా పూర్తి చేసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన వివరాలను అధికారులు రాష్ట్రపతికి వివరించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా త్రివిధ దళాలు పోరాడిన తీరును ఈసందర్భంగా రాష్ట్రపతి అభినందించారు.

## వ్యవసాయ రంగంలో
# ఏపీ నంబర్ వన్

పరిశ్రమలు వస్తే ఉపాధి పెరుగుతుంది
నిత్య విద్యార్థిలా ఎల్లప్పుడు కొత్త విషయాలు నేర్చుకుంటా
సాంకేతిక యుగంలో సమర్థత అవసరం
ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త రావాలి
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు






**విజయవాడ, విశాఖ సమాచారం:** వ్యవసాయ రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఏపీ ఉందని, పరిశ్రమలు కూడా వస్తే రాష్ట్రానికి ఆదాయం సమకూరి ఉపాధి పెరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలోని పశు సంవర్ధకక శాఖ టెక్ ఏఐ2.0 కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'పాత్ వేస్ ...(మిగతా 2లో)



## ఏపీలో 'మెట్రో'పై కీలక ముందడుగు

### విదేశీ బ్యాంకు ప్రతినిధులతో ఎండీ భేటీ

**అమరావతి, విశాఖ సమాచారం:** ఏపీలో మెట్రో రైలు ప్రాజెక్టులపై కీలక ముందడుగు పడింది. పలు విదేశీ బ్యాంకుల ప్రతినిధులతో మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి బుధవారం భేటీ అయ్యారు. తక్కువ వడ్డీకి రుణం ఇచ్చే బ్యాంకులతో ఎండీ సంప్రదింపులు చేశారు. ఈ సమావేశానికి కేఎఫ్‌డబ్ల్యూ, ఏఎఫ్‌డీ, ఏడీబీ, ...(మిగతా 2లో)

## పండగ వాతావరణంలో మహానాడు

### 27 నుంచి 29 వరకు కడపలో నిర్వహణ

### ఏర్పాట్లపై మంత్రి లోకేశ్ సమీక్ష



**మంగళగిరి, విశాఖ సమాచారం:** తెలుగుదేశం పార్టీ మహానాడుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మహానాడును మే 27 నుంచి 29 వరకు కడపలో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. మహానాడు ఏర్పాట్లపై పొలిట్ బ్యూరో సమావేశానికి ముందు ఆయన మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో మహానాడు కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లతో సమావేశమయ్యారు. మహానాడు ఏర్పాట్ల గురించి నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. పొలిట్ బ్యూరో సమావేశంలో మహానాడు ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోని మంత్రుల కమిటీ నివేదిక ఇవ్వనుంది. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "ఏటా మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నాం. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడును నిర్వహించాం. గత ప్రభుత్వంలో మహానాడుకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారు. అయినా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారు. పార్టీ ఆవిర్భావం తర్వాత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తిరుగులేని మెజార్టీ సాధించాం. మహానాడుకు వచ్చే కార్యకర్తలకు వసతి, రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి" అని నేతలకు దిశానిర్దేశం చేశారు.

**మే 29న బహిరంగ సభ**

మూడు రోజుల పాటు జరిగే ఈ మహానాడులో.. మొదటి రోజు టిడిపి విధి విధానాలు, సిద్ధాంతాలు, కార్యాచరణపై చర్చించనున్నారు. రెండో రోజు రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన తీర్మానాలు చేయనున్నారు. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. పార్లమెంట్ మహానాడు, నియోజకవర్గ మహానాడు నిర్వహణపైనా ఈ సమావేశంలో చర్చించారు.

సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, సవిత, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ ...(మిగతా 2లో)



## బీజేపీలో చేరిన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం


**అమరావతి, విశాఖ సమాచారం:** వైసీపీకి చెందిన జకియా ఖానం బుధవారం బీజేపీలో చేరారు. ఆమె వైసీపీకి, మండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. అనంతరం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు. ఆమెను పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. జకియా ఖానం బీజేపీ లో చేరడం సంతోషమన్నారు. జకియా ఖానం మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అందరికీ సమాన హక్కులు అమలు చేస్తున్నారని తెలిపారు. ముస్లిం మహిళలకు భరోసా ఇచ్చిన ఏకైక ప్రధాని మోదీ అని పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీల నుంచి మంచి సందేశమిచ్చేందుకునే పార్టీలో చేరినట్లు చెప్పారు.

## కడప మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు



**కడప, విశాఖ సమాచారం:** కడప మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు పడింది. విజిలెన్స్ విచారణ నివేదిక ఆధారంగా మేయర్ పదవి నుంచి సురేష్‌బాబును తొలగిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి బుధవారం జీవో జారీ చేశారు. కడప నగరంలో అభివృద్ధి పనులను ఇష్టారాజ్యంగా తన కుటుంబానికి చెందిన కాంట్రాక్టు సంస్థ ఎంఎస్ వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ ద్వారా చేయించినట్లు ...(మిగతా 2లో)

## 'విజ్ఞాన సర్వస్వ రూపశిల్పి కొమర్రాజు లక్ష్మణరావు' గ్రంథావిష్కరణ




విశ్రాంతాచార్యులు వెలమల సిమ్మన్న, విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు గుమ్మా సాంబశివరావు రచించిన 'విజ్ఞాన సర్వస్వ రూపశిల్పి కొమర్రాజు లక్ష్మణరావు' గ్రంథాన్ని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు.

- వివరాలు 7లో

## నౌకలో 21 మంది పాక్ సిబ్బంది

### పరదీప్ పోర్టులో కలకలం



**పరదీప్:** ఒడిశాలోని పరదీప్ పోర్టుకు వచ్చిన ఓ షిప్ కలకలం రేపింది. అందులో 21 మంది పాకిస్థాన్ సిబ్బంది ఉన్నట్లు అధికారులు గుర్తించడమే అందుకు కారణం. దీంతో ఆ పోర్టులో భద్రతను పెంచారు. ఆ ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించారు. బుధవారం ఉదయం దక్షిణ కొరియా నుంచి సింగపూర్ మీదుగా ఓ నౌక పరదీప్ పోర్టుకు చేరింది. 'ఎమ్‌టీ సైరెన్ II' పేరుతో ఉన్న ఈ షిప్‌లో మొత్తం 25 మంది సిబ్బంది ఉన్నారు. ఇది ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ కోసం ముడి చమురును తీసు కొచ్చింది. తనిఖీలు చేపట్టగా సిబ్బందిలో 21 మందిని పాకిస్థానీయులుగా గుర్తించారు. ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి దీనిగురించి సమాచారం అందడంతో వెంటనే ఒడిశా మెరైన్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. పోర్టులో భద్రతను మరింత పెంచినట్లు మెరైన్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బబితా దుహేరి ...(మిగతా 2లో)



## ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కరాచీ పోర్టు దిగ్బంధం

2లో

## ఉద్రిక్తతలు తగ్గాలంటే కలిసి డిన్నర్ చేయాలి

### భారత్-పాకిస్థాన్‌కు ట్రంప్ సూచన



**సౌదీ అరేబియా:** భారత్-పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే కారణమంటూ పేర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అదే పాట పాడారు. ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికి ఇరుదేశాలు కలిసి మంచి డిన్నర్ ఏర్పాటుచేసుకోవాలని తాజాగా సూచించారు. అణుక్షిపణులతో యుద్ధాలు వద్దని కోరారు. సౌదీ అరేబియాలో మాట్లాడుతూ తనను తాను శాంతికర్తగా అభివర్ణించుకున్న ట్రంప్.. రెండు అణ్వాయుధ దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నించినట్లు చెప్పారు. యూఎస్-సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లో ట్రంప్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ ...(మిగతా 2లో)

# కడప మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు

(మొదటి పేజీ తరువాయి)

విజిలెన్స్ ఆధారాలు సేకరించింది. మేయర్ పదవిని అనుభవిస్తూ ప్రత్యక్షంగా/ పరోక్షంగా ఆయన/ కుటుంబసభ్యులు కాంట్రాక్ట్ పనులు చేయవచ్చా?.. చేయరాదనే విషయం మేయర్ దృష్టికి తీసుకెళ్లారా?.. మొత్తంగా వర్ధిని కంపెనీ ఎన్ని పనులు చేపట్టిందనే విషయాలు రాబట్టింది. గుత్తేదారు కంపెనీ డైరెక్టర్లుగా మేయర్ కుమారుడు అమరేశ్, భార్య జయశ్రీ ఉన్నారు. పురపాలక చట్టం నిబంధనలు అతిక్రమించినందున పదవులకు అనర్హులవుతారనే సమాచారాన్ని కమిషనర్ మనోజ్‌రెడ్డి నుంచి రాతపూర్వకంగా తీసుకున్నారు. ఇదే విషయాన్ని మేయర్‌కు సైతం తెలియజేస్తూ కమిషనర్ లేఖ రాశారు. మంగళవారం మున్సిపల్‌శాఖ కార్యదర్శి ఎదుట హాజరై సురేష్‌బాబు వివరణ ఇచ్చారు. కమిషనర్ ఇచ్చిన సమాచారంతో విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి విచారణ నివేదిక అందించారు. ఈ నివేదిక ఆధారంగా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి నిర్ణయం తీసుకున్నారు. మొత్తం రూ.36లక్షలు అవినీతికి పాల్పడినట్టు సురేష్‌బాబుపై ఆరోపణలున్నాయి. కాగా వైసిపి కార్పొరేటర్లను తమ వైపుకు తిప్పుకోవడం ద్వారా మేయర్ ను పదవి నుంచి దించాలని టిడిపి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అక్రమ ఆరోపణలతో పదవి నుంచి తొలగించారని వైసీపీ నాయకులు విమర్శిస్తున్నారు

# పండగ వాతావరణంలో మహానాడు

(మొదటి పేజీ తరువాయి)

డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు సీనియర్ నేతలు బీద రవిచంద్ర యాదవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దామచర్ల సత్య, రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, వీరంకి వెంకట గురుమూర్తి, మంతెన రామరాజు, సి.భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, ఆర్.మాధవి రెడ్డి, జీవీ ఆంజనేయులు, మంతెన సత్యనారాయణ రాజు, చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్రిక్తతలు తగ్గాలంటే కలిసి డిన్నర్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సల్మాన్, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తదితరులు హాజరయ్యారు. భారత్-పాకిస్థాన్ మధ్య అణుయుద్ధం నివారించడానికి తన మధ్యవర్తిత్వం సహాయపడిరదని మరోసారి ట్రంప్ వెల్లడిరచారు. ఇది లక్షలాది ప్రాణాలను కాపాడిరదని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు మరింత తగ్గేందుకు.. భారత్, పాకిస్థాన్ దేశాలు మంచి డిన్నర్ ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఇరుదేశాల మధ్య శాంతి ప్రక్రియలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియోలు పాలుపంచుకున్నారని కొనియాడారు. "ఇరుదేశాల పరిస్థితి బాగుందని అనుకుంటున్నాను. వాళ్లని మనం ఒకచోట చేర్చవద్దు. మార్కో రూబియో, వాళ్లు కలిసి బయటకు వెళ్లి మంచి విందు చేసుకోవచ్చు. ఇది బాగుంటుంది కదా?" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. "కొన్ని రోజుల క్రితమే భారత్-పాకిస్థాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించడానికి చారిత్రక కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలుచేయడంలో మా యంత్రాంగం విజయవంతమైంది. ఈ విషయంలో నేను వాణిజ్య అంశాలను ఎక్కువగా ఉపయోగించాను" అని ట్రంప్ మరోసారి వెల్లడిరచారు. 'సహచరులారా రండి..ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందాం..కొంత వ్యాపారం చేద్దాం' అని వారికి నచ్చచెప్పాను. అణు క్షిపణుల వాణిజ్యం చేయొద్దు. అందరికీ ఆనందం కలిగేలా చేద్దాం. వారిద్దరూ (భారత్-పాక్ పాలకులు) గొప్ప, శక్తిమంతమైన, ఉత్తమ, తెలివైన నేతలు. అంతా(యుద్ధం) నిలిచిపోయింది. అది అలాగే కొనసాగాలని ఆశిద్దాం అంటూ ఎలాన్‌మస్క్ వంటి ఉన్నతస్థాయి ఆహూతుల కరతాళధ్వనుల మధ్య ట్రంప్ పేర్కొన్నారు. అయితే.. కాల్పుల విరమణ విషయంలో మూడోపక్ష మధ్యవర్తిత్వాన్ని భారత్ తిరస్కరించిన విషయం తెలిసిందే. భారత్, పాకిస్థాన్‌లకు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) తమంత తాముగా అవగాహనకు వచ్చారని, ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయం లేదని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# నౌకలో 21 మంది పాక్ సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఓడరేవు ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం ఈ నౌక పోర్టుకు 20 కి.మీ. దూరంలోని 'పీఎం బెర్త్' వద్ద లంగర్ వేసి ఉంది. ఇందులో 11,350 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముడి చమురు అన్‌లోడింగ్ పూర్తయ్యే వరకూ 25 మంది సిబ్బంది నౌకను వీడకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

# ఏపీలో 'మెట్రో'పై కీలక ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌డీబీ, ఏఐఐబీ, జైకా, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు హాజరయ్యారు. వీరంతా విజయవాడలో ప్రతిపాదిత మెట్రో కారిడార్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో విశాఖ మెట్రోకు రూ.6,100 కోట్లు, విజయవాడ మెట్రోకు రూ.5,900 కోట్లు రుణం సమీకరించాలని నిర్ణయించారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో విదేశీ బ్యాంకుల ప్రతినిధులు చర్చలు జరపనున్నట్లు సమాచారం.

# సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణస్వీకారం

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. గత ఆరేళ్లలో జస్టిస్ గవాయ్ సుమారు 700 ధర్మాసనాల్లో భాగస్వామ్యం పంచుకొని రాజ్యాంగ, పరిపాలన, సివిల్, క్రిమినల్ చట్టాలు, వాణిజ్య వివాదాలు, ఆర్బిట్రేషన్, విద్యుత్తు, విద్య, పర్యావరణానికి సంబంధించిన కేసులను విచారించారు.

# కర్నల్ సోఫియాపై అభ్యంతరకర వ్యాఖ్యలు

## ఖండించిన జాతీయ మహిళా కమిషన్




**ఢిల్లీ:** పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ ఖండించింది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న కొంతమంది వ్యక్తులు స్త్రీల పట్ల అలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని కమిషన్ ఛైర్ పర్సన్ విజయ రహాట్కర్ వ్యాఖ్యానించారు. ఇది మన సమాజంలోని మహిళల గౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా దేశ భద్రతలో ముఖ్యపాత్ర పోషిస్తున్న కుమార్తెలను అవమానించినట్లు అవుతుందని పేర్కొన్నారు. మంత్రి పేరు నేరుగా ప్రస్తావించనప్పటికీ గౌరవనీయ స్థానాల్లో ఉన్నవారు స్త్రీల పట్ల గౌరవప్రదమైన వైఖరిని పెంపొందించుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. "కర్నల్ సోఫియా ఖురేషీ దేశం గర్వించదగ్గ భారత పుత్రిక. దేశాన్ని ప్రేమించే భారతీయులందరికీ సోదరి. ఎంతో ధైర్యం, అంకిత భావంతో ఆమె దేశసేవ చేస్తున్నారు. అటువంటి మహిళలను చూసి దేశం గర్వపడుతోంది. దేశం ప్రగతిశీల అభివృద్ధి వైపు వెళ్లాలంటే స్త్రీలు ప్రతి రంగంలోనూ ముందువచ్చి నాయకత్వం చేపట్టాలి. మహిళలపై అగౌరవ వ్యాఖ్యలు చేయడం దేశాభివృద్ధిని అడ్డుకోవడమే " అని మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ విజయ రహాట్కర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

**ఓ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా**

సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి ప్రసంగించారు. 'వాళ్లు (ఉగ్రవాదులు) మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచేసి వితంతువుల్ని చేశారు. వాళ్ల (ఉగ్రవాదుల) మతానికి చెందిన సోదరిని సైనిక విమానంలో మోదీజీ పాక్‌కు పంపించి పాఠం నేర్పించారు' అని ఇండోర్ సమీప గ్రామంలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని రేకెత్తించాయి. ఆయన మంత్రి పదవిపై వెంటనే వేటువేయాలని కాంగ్రెస్ నేతలు ప్రధానికి విజ్ఞప్తిచేశారు. మంత్రి వ్యాఖ్యలు అత్యంత సిగ్గుచేటుగా, కించపరిచేవిగా ఉన్నాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పుబట్టారు. తన వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో మంత్రి క్షమాపణలు తెలియజేశారు. ఉగ్రవాదుల దుశ్చర్యలతో తన మనసు వికలమై అలాంటి వ్యాఖ్యలు చేశానని, కులమతాలకు అతీతంగా ఖురేషీ చేసిన సేవలకు తాను సెల్యూట్ చేస్తున్నానని విలేకరులకు చెప్పారు. ఆమెను కించపరిచే ఆలోచన కలలో కూడా రాదని, తన మాటలు ఎవరినైనా నొప్పిస్తే పదిసార్లు క్షమాపణ చెప్పేందుకు సిద్ధమని అన్నారు.

# సిట్ ఎదుట హాజరైన ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి

## మద్యం కుంభకోణం కేసు




**విజయవాడ, విశాఖ సమాచారం:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి సిట్ విచారణకు హాజరయ్యారు. వీరిద్దరూ ఈ కేసులో ఏ31, ఏ32 నిందితులుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి మే 16 వరకు తదుపరి చర్యలు చేపట్టవద్దని ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, విచారణకు హాజరుకావాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని విజయవాడలోని సిట్ కార్యాలయంలో అధికారులు విచారిస్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో.. నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను ఇటీవల సిట్ నిందితులుగా చేర్చింది. ఈ కేసులో ఏ 33 నిందితుడుగా ఉన్న గోవిందప్ప మంగళవారం అరెస్టయిన విషయం తెలిసిందే. సిట్ అధికారులు తాజాగా ఆయన్ను విజయవాడ సీబీఐ కోర్టులో హాజరుపర్చారు.



# చెరువులో మునిగి ముగ్గురి మృతి

**భీమడోలు, విశాఖ సమాచారం:** ఏలూరు జిల్లా భీమడోలు మండలంలో విషాదం చోటు చేసుకుంది. బుధవారం మధ్యాహ్నం కోమటిగుంట చెరువులో మునిగి ముగ్గురు మృతి చెందారు. భీమడోలు మండలంలోని పెదలింగంపాడులో వేడుకకు హాజరైన నలుగురు తిరుగు ప్రయాణంలో కాలకృత్యాల కోసం కోమటిగుంట చెరువు వద్ద ఆగారు. ఈ క్రమంలో ప్రమాద వశాత్తు చెరువులో పడి ముగ్గురు మృతి చెందారు. మృతులు పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన అజయ్ (28), అభిలాష్ (16), సాగర్ (16)గా గుర్తించారు.

# వ్యవసాయ రంగంలో ఏపీ నంబర్ వన్

(మొదటి పేజీ తరువాయి)

టు ప్రాస్పెరిటీ', నెక్స్ట్- జెన్ యానిమల్ హస్బెండ్రీ', 'విజనరీ' అనే మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పశుసంవర్ధక విభాగంలో సమ్మిళిత, స్థిరమైన వృద్ధి, భవిష్యత్ ప్రణాళికలు, పేదరిక నిర్మూలన వంటి వాటిపై రాసిన ఈ పుస్తకాలు ఉపయోగపడతాయన్నారు. సాంకేతికత ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉందని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉన్నారని, వారిలో తెలుగు వాళ్లే అధికమన్నారు. ప్రపంచంలో యువత ఎక్కువగా ఉండేది భారత్‌లోనేనని చెప్పారు. గతంలో ఏ పని చేయాలన్న ప్రభుత్వం అనుమతి అవసరమన్నారు. 1991లో ఆర్థిక సంస్కరణలు రాగానే మార్పులు వచ్చాయని తెలిపారు. అప్పుడప్పుడే వస్తున్న ఐటీని సద్వినియోగం తీసుకున్నామని తెలిపారు. అప్పుడే వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏ పనులైనా సులువుగా చేసుకుని పరిస్థితి వచ్చిందని తెలిపారు. గతంలో రోడ్లు గుంతలుగా ఉండేవని, ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో వాటిని చక్కగా నిర్మించారని వివరించారు. తాను నిత్య విద్యార్థిని అని, ఎల్లప్పుడూ నేర్చుకోవడానికి ప్రయత్నిస్తానని తెలిపారు.

**పేదరికం లేని సమాజమే లక్ష్యం**

పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం తెలిపారు. సంపద సృష్టించాలి.. ప్రజలకు అందించాలి అనేది తన ధ్యేయమన్నారు. ఇష్టపడి పని చేస్తే కష్టం ఉండదని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ లో ఇప్పటికే 330 సర్వీసులు ఇస్తున్నామని, మరి కొద్ది రోజుల్లో 400కు పెంచుతామని వెల్లడిరచారు రెండు మూడు నెలల్లో వాట్సప్ గవర్నన్స్?పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదగాలని పిలుపునిచ్చారు. అందుకే రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. దేశంలో మైక్రో ఇరిగేషన్ కు ఆంధ్రప్రదేశ్ చిరునామా కావాలని ఆకాంక్షించారు. సాంకేతిక యుగంలో సమర్థత పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు

# ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కరాచీ పోర్టు దిగ్బంధం



**డిల్లీ:** ఆపరేషన్ సిందూర్‌పై పాక్ ప్రతిస్పందించే అవకాశాన్ని పసిగట్టిన భారత్ కరాచీ పోర్టు లక్ష్యంగా ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించినట్లు అధికారులు పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రతిగా పాక్ ప్రతిస్పందించే అవకాశాన్ని పసిగట్టిన నావికాదళం సముద్ర సంసిద్ధతను గణనీయంగా పెంచడానికి పలు చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా టపాక్‌లోని కరాచీ పోర్టు లక్ష్యంగా ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాటిని మోహరించడంతో ఆపరేషన్ సిందూర్ ఫలించిందని తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌పై త్రిముఖ ఒత్తిడి వ్యూహాన్ని ప్రయోగించామని నావికాదళ అధికారులు పేర్కొన్నారు. కరాచీ పోర్ట్‌ను లక్ష్యంగా చేసుకొని 36 ఫ్రంట్‌లైన్ నావికా దళాలను మోహరించామని తెలిపారు. వీటిలో బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన ఏడు డిస్ట్రాయర్లు, మీడియం-రేంజ్ సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణులు, వరుణాస్త్ర హెవీవెయిట్ టార్పెడోలు ఉన్నాయన్నారు. వీటిలో కొత్తగా ప్రవేశపెట్టిన ఐ ఎన్ ఎస్ తుషిల్‌తో సహా ఏడు స్టెల్త్ గైడెడ్-క్షిపణి యుద్ధనౌకలను సైతం మోహరించినట్లు వివరించారు. ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కరాచీ పోర్టును దిగ్బంధించడం వల్ల వారి నావికాదళం సమర్థవంతంగా ప్రతిస్పందించలేకపోయిందని.. కేవలం నౌకాశ్రయానికే పరిమితమవ్వాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్య నౌకలు తమ దారిని మళ్లించుకున్నాయి.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసింది. కాగా ఇందులో భారత క్షిపణులు పాకిస్థాన్ అణుస్థావరాలను తాకినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. మే 9 అర్ధరాత్రి, 10వ తేదీన పాకిస్థాన్‌లోని కీలక వాయుసేన స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశామని భారత్ ప్రకటించింది. పూర్తి స్వదేశీ ఆయుధాలతో దాడి చేసి 11 వాయుసేన స్థావరాలను దెబ్బతీసినట్లు తెలిపింది. రావల్పిండిలోని పాక్ న్యూక్లియర్ కమాండ్ కంట్రోల్‌కు సమీపంలో ఉన్న నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ పైనా ఇండియన్ ఆర్మీ ప్రిసిషన్ స్ట్రైక్స్ చేసింది. దీంతో పాక్ అమెరికా సహాయంతో భారత్‌తో కాళ్ల బేరానికి వచ్చింది.

**ఐఎన్ఎస్ విక్రాంత్..**

రూ.20వేల కోట్లతో నిర్మించిన ఐఎన్ఎస్ విక్రాంత్‌ను 2022 సెప్టెంబర్‌లో నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. 262 మీటర్ల పొడవు, 62 మీటర్ల వెడల్పుతో ఐఎన్ఎస్ విక్రాంత్ భారత్‌లో నిర్మించిన అతిపెద్ద యుద్ధనౌక. మిగ్-29కే, హెలికాప్టర్‌లతో సహా 30 యుద్ధ విమానాలను ఇది మోసుకెళ్లగలదు. విక్రాంత్ డిజైన్‌ను భారత నౌకాదళంలోని వార్‌షిప్ డిజైన్ బ్యూరో తయారుచేసింది. ఈ నౌక నిర్మాణాన్ని కొచ్చిన్ షిప్ యార్డ్ పూర్తిచేసింది.

# త్వరలో ఏపీ పోలీస్ అకాడమీ ఏర్పాటు

## గండిగుంట పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవంలో హోంమంత్రి అనిత



**అమరావతి, విశాఖ సమాచారం:** ఏపీకి పోలీస్ అకాడమీ లేదని త్వరలోనే 'అప్పా' ఏర్పాటు చేస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు రూరల్ కొత్త పోలీస్ స్టేషన్ భవనాన్ని హోంమంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి విస్తరణ కారణంగా భవనాలను అప్పట్లో తొలగించారు. ఎంతో సహృదయంతో గండిగుంట గ్రామానికి చెందిన సామాజిక వేత్త సజ్జా వెంకటేశ్వరరావు ప్రభుత్వ కార్యాలయాలకు గండిగుంట శివారు కాకానీనగర్‌కు సమీపంలో 1 ఎకరం 85 సెంట్లు స్థలాన్ని ఇచ్చి దాతృత్వం చాటుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రూ.25లక్షలతో ఉయ్యూరు రూరల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించినట్లు స్పష్టం చేశారు. ఆధునిక హంగులతో భవనాన్ని నిర్మించేందుకు..కృషి చేసిన అందరినీ హోంమంత్రి అభినందించారు. శ్రమదానం, జన్మభూమి , పీ4 కార్యక్రమాలు సీఎం చంద్రబాబునాయుడులోని సామాజిక బాధ్యతకు నిదర్శనమని హోంమంత్రి అనిత అన్నారు. ఉన్నఊరు, కన్నతల్లిని మరవొద్దన్నదే ఆయన సిద్ధాంతమన్నారు. విజిబుల్‌తో పాటు ఇన్విజిబుల్ పోలీసింగ్‌కు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఏపీలోనే కృష్ణా జిల్లాలో అత్యధిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినందుకు అభినందనలు తెలిపారు. డ్రోన్లు సహా టెక్నాలజీ ద్వారా నేరాలను నియంత్రిస్తామన్నారు. డ్రోన్ ఎగిరితే నేరస్తుల గుండెల్లో రైళ్లు పరిగెట్టేలా పోలీస్ నిఘా వ్యవస్థ పటిష్ఠం చేసినట్లు స్పష్టం చేశారు. ప్రతి ఇంట్లో ఓ పోలీస్ మనస్తత్వం కలిగిన వారు ఉండాలి..అప్పుడే నేరరహిత సమాజం సాధ్యమని హోంమంత్రి పేర్కొన్నారు. లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు సహకరించడమే కాకుడా ఎక్సైజ్ శాఖలో కీలక సంస్కరణలు చేపడుతోన్న మంత్రి కొల్లురవీంద్రకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎస్పీ ఆర్.గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పదవి నుంచి కిశోర్ తొలగింపు

**మాచర్ల, విశాఖ సమాచారం:** పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ కిశోర్‌కు కూటమి ప్రభుత్వం నుంచి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. కిశోర్‌ను ఛైర్మన్ పదవి నుంచి తొలగిస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఛైర్మన్ పదవి దుర్వినియోగం చేశారని, మున్సిపల్ చట్టం సెక్షన్ 16(1) ఉల్లంఘించారని అతనిపై ఆరోపణలు ఉన్నాయి. అనుమతిలేకుండా వరుసగా 15 సార్లు కౌన్సిల్ భేటీలకు కిశోర్ గైర్హాజరయ్యారు. దీంతో మున్సిపల్ ఛైర్మన్‌గా అతన్ని తొలగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

2nd pages111.qxd 5/14/2025 8:18 PM Page 3



# ఉపాధి హామీ శ్రామికులందరూ బాధ్యతగా వ్యవహరించాలి



రావికమతం, (విశాఖ సమాచారమ్):- ఉపాధి శ్రామికులందరూ చాలా బాధ్యతాయుతంగా ఉపాధి పనిలో వ్యవహరించాలంటూ సర్పంచ్ దాసరి కుమారి వరహాలు తెలిపారు. ఉపాధి శ్రామికులతో బుధవారం పని ప్రదేశం వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా చేసేటటువంటి ప్రతి పని చాలా నాణ్యతగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన రోజువారి వేతన కూలి 307 రూపాయలు ప్రతి ఒక్కరూ పొందేలా పనిచేయాలని కోరారు. అలాగే ప్రభుత్వం ప్రతి జాబ్ కార్డుకు కేటాయించిన 100 రోజుల పనిని పూర్తిచేసుకుని 30 వేల 700 రూపాయలు ప్రతి ఏడాది పొందాలని అన్నారు. అలాగే మన గ్రామానికి ఉపయోగపడే పనులు అన్నింటిని ఉపాధి హామీ పథకం ద్వారా మనం చేసుకోవడానికి అవకాశం ఉన్నందున అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకు పని ప్రదేశానికి వచ్చే విధంగా అందరూ సహకరించాలని, అదేవిధంగా ఎండ దెబ్బ తగలకుండా ముందుగా పని పూర్తి చేసుకొని ఇంటికి తిరిగి వెళ్లే విధంగా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు.

మనము చేసే పని యొక్క క్యూబిక్ మీటర్ రేటు ప్రకారం కొలతలు తీసుకొని పనిచేసుకోవాలన్నారు.

దాని ప్రకారమే ఉపాధి శ్రామికులకు వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. తీరని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు 307 రూపాయలు పొందే విధంగా శ్రామికులందరూ పనిచేసుకోవాలని సూచించారు.

గ్రామానికి రోడ్లు, పశువుల తొట్టెలు, ఫారం పాండ్స్, ఫీల్డ్ చానల్స్, ఫీడర్ చానల్స్, హార్టికల్చర్,అవెన్యూ ప్లాంటేషన్, స్మశాన వాటికల అభివృద్ధి, బౌండ్రి ట్రెంచెస్ , రింగు ట్రెంచెస్, గడ్డి పెంపకం,మొదలగు పనులుకు, ఎక్కువ ప్రాధాన్యత ఉందన్నారు. ఇటువంటి పనులు అన్నింటిని మన గ్రామంలో చేసుకొనట్లైతే గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తుందని, తద్వారా ఉపాధి శ్రామికులందరికీ ఉపాధి కూలీ కల్పించడమే కాకుండా, వలసల నియంత్రణ కూడా జరుగుతుందన్నారు. మన గ్రామంలోనే ఉంటూ మనం ఉపాధి అవకాశంఈ పథకం ద్వారా ఉన్నందున దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలియపరిచారు. జాబు కలిగిన ప్రతి ఒక్కరు అందరూ పనిలోకి రావాలని, ఒకవేళ ఇంకనూ ఎవరికైనా జాబ్ కార్డు లేకపోతే తమ దృష్టి తీసుకు వచ్చినట్లయితే తక్షణమే వారికి జాబ్ కార్డు ఇప్పించడం కూడా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పెద్దలు, శ్రామికులు పాల్గొన్నారు.

## మండలంలో ఉపాధి హామీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుడిగాలి పర్యటన



రావికమతం, (విశాఖ సమాచారమ్):- అనకాపల్లి జిల్లా ఉపాధి హామీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమదేవి పలు గ్రామాల్లో ఆకస్మికంగా సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా చీమలపాడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, ఉపాధి శ్రామికులతో సమావేశం అయ్యారు. పని యొక్క నియమ నిబంధనలు గురించి, ఉపాధి శ్రామికులందరికీ తెలియపరిచారు. అలాగే ఇటీవల గర్నెకం గ్రామంలో నూతనంగా నిర్మించిన పశువుల తొట్టెను ఆమె పరిశీలించారు. అనంతరం రావికమతం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్థాయి క్షేత్ర సహాయకులు, కార్యాలయం సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ సిబ్బంది అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, పని విషయంలో ఏ ఒక్కరు అలసత్వం వహించరాదని ఆమె హెచ్చరించారు. మండలము యొక్క యావరేజ్ యావరేజ్ ఎక్కువ చేస్తున్నా వేజ్ పెరిగే విధంగా ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. అలాగే పలు పారామీటర్స్ ప్రకారం పని జరిగే విధంగా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా లేబర్ బడ్జెట్,ఫారం పాండ్స్ ,కంపోస్ట్ పిట్స్, పశువుల తొట్టెలు, పశువుల షెడ్లు, మొదలగు పనులుకు ప్రాధాన్యత కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న బాబు, ఏపీవో చిన్నారావు పలువురు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే
దక్షిణ మధ్య రైల్వే యొక్క టెండరు నోటీసులలోని వివరములు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in నందు కూడా చూడవచ్చును.
ఈ-టెండరు నోటీస్ నెం. బి/ఈ.ఈజీఎస్ 03/2025-26 తేది.12.05.2025
PUB/0549
భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకం చేసిన వారు దిగువ తెలిపిన పనులకు ఎదురుగా సూచించబడిన తేదీలలో గం. 15.00 వరకు ఈ-టెండర్లు ఆహ్వానించుచున్నారు.
వ.నెం.: 01 టెండరు నెం.: బి/ఈ.29/I/ఈజీఎస్/ 05/25-26 తేది. 08.05.2025 పని పేరు : బిజెడ్ఎ డివిజన్ : అన్ని ఎ1, ఎ,బి,డి & ఈ కేటగిరి రైల్వేస్టేషన్లు అన్నింటిలోను వీడియో సర్వేలైన్స్ వ్యవస్థకు ఎయిర్‌కండీషన్ మిగిలిపోయిన పనులు చేపట్టుట. 1) వీడియో సర్వేలైన్స్ వ్యవస్థను కంట్రోల్ సెంట్రల్ మరియు 21 ప్రాంతాలకు విద్యుత్ కల్పించుట. 2) 87 ప్రాంతాలకు వీడియో సర్వేలైన్స్‌లకు విద్యుత్ సదుపాయం కల్పించుట. టెండరు విలువ (రూ): 17,56,323/- ధరావత్తు/బిడ్ సెక్యూరిటీ (రూ): 35,100/- టెండరు డాక్యుమెంట్ వెల (రూ): లేదు పూర్తి చేయు కాలము: 6 నెలలు మూసివేయు తేది: 30.05.2025
ఔత్సాహిక టెండరుదారులు పై టెండరు మూసివేయు తేదీకి ముందు రోజు వరకు ఏవైనా సవరణలు/ మార్పులు చేయబడివేమో తెలుసుకొనుట కొరకు మా వెబ్‌సైట్ "www.ireps.gov.in" సందర్శించవలసిందిగా సూచించడమైనది
డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎలక్ట్రికల్), విజయవాడ
A0679
టెండరు షరతులు/వివరాలు/ నిబంధనలు, మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in లేదా http://www.scr.indianrailways.gov.in ను సందర్శించండి.

## మాకవరపాలెం పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

### పోలీసు విధుల్లో నాణ్యత పెంపునకు సూచనలు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా




మాకవరపాలెం, (విశాఖ సమాచారమ్):- అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని శుభ్రత, నిర్వహణ, రికార్డుల సంరక్షణను సమీక్షించారు. అన్ని రికార్డులు సమయానికి నవీకరించాలనే సూచనలతో పాటు, నేర నివారణపై మరింత దృష్టి పెట్టాలన్నారు. స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంటున్న నేరాల స్వరూపం గురించి అధికారుల నుంచి సమాచారం తీసుకున్న ఎస్పీ, నేర చరిత్ర గలవారి మరియు అనుమానితులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైతే కౌన్సిలింగ్ కూడా ఇవ్వాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణాపై గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులకు, మహిళలకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ మరియు మహిళా చట్టాలపై శక్తి యాప్ ప్రాముఖ్యతను తెలిపి ప్రతి ఒక్కరూ యాప్ ను డౌన్లోడ్ చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. రహదారి భద్రతా ప్రమాణాలు, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అనేది నేర నియంత్రణలో కీలకమని, దీనిపై ప్రజలలో అవగాహన పెంచాలని స్పష్టం చేశారు. తనిఖీ అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, వారి సేవలను అభినందించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సహాయాన్ని అందించేందుకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ తనిఖీ సందర్భంగా నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీమతి ఎల్.రావతమ్మ, తదితరులు ఎస్పీ తో ఉన్నారు.

## రహదారి నిర్మాణ పనుల్ని వేగవంతం చేయాలి

### ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కొణతాల



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్) అనకాపల్లి శాసనసభ్యులు కొణతాలరామకృష్ణ స్థానిక రింగ్ రోడ్ లో ఉన్న క్యాంప్ కార్యాలయంలో, అనకాపల్లి ఆర్ అండ్ బి ఏఈ, ప్రభుదాస్ తో రహదారుల అభివృద్ధిపై చర్చించారు. కొత్తూరు పంచాయతీ ఏఎమ్ఎల్ కాలేజీ ఫ్లైఓవర్, కొత్తూరు రోడ్డు పనులు, తుమ్మపాల చినబాబు కాలనీ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు పనులు చేయడంలో నిర్లక్ష్యంచేయడం తగదని త్వరితగతిన పూర్తి చేయాలని హెచ్చరించారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, అమృత్ పథకం డిఈ, కశింకోట మండలం ఎమ్మార్వో సివిల్ సప్లై డిటి మరియు రెవెన్యూ అధికారులు కలిశారు. వారి పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు మరియు చేయవలసిన పనులు గురించి ఎమ్మెల్యే తో చర్చించారు. అధికారులు కలిశారు. వారి పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు మరియు చేయవలసిన పనులు గురించి ఎమ్మెల్యే రామకృష్ణ చర్చించారు.

## జల జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించిన శాసనసభ్యులు

రావికమతం, (విశాఖ సమాచారమ్):- మండలంలో చీమలపాడు పంచాయతీ,చలసింగం గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన జలజీవన్ మిషన్ పథకాన్ని చోడవరం శాసనసభ్యులు కే ఎస్ ఎం ఎస్ రాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన చలిసింగం గ్రామంలో మంచినీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న కారణంగా జలజీవన పథకంలో ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలన్న ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించమన్నారు. అదేవిధంగా ప్రభుత్వం గిరిజన గ్రామాలన్నింటికీ రహదారి సౌకర్యం, మంచి నీటి సౌకర్యం తోపాటు పలు సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం గిరిజనులతో కలిసి శాసనసభ్యులు రాజు సహబంతి కార్యక్రమంలో పాల్గొని భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రావికమతం మండల పార్టీ అధ్యక్షుడు రాజనకొండ నాయుడు, కొత్తకోట మాజీ సర్పంచ్ కోట గోవిందు, దొండపూడి మాజీ ఉపసర్పంచ్ ఆచారి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 8వ జోన్‌లో తాగు నీటికి అంతరాయం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- మహా విశాఖ నగరపాలక సంస్థ, 8వ జోన్ పరిధిలో పలు ప్రాంతాలకు ఈనెల 16, 17 తేదీలలో తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

విశాఖపట్నం ప్రధాన వనరులైన తాటిపూడి మంచినీటి సరఫరా చేయు పథకము 900 ఎంఎం వ్యాసము గల ఎంఎస్ పంపింగ్ పైప్ లైను రాయ్ పూర్ నుండి సబ్బవరం నేషనల్ హైవే నిర్మాణ పనులు భాగంగా మరియు అమృత్ -2.0, 24/7 వాటర్ సప్లై సిస్టం నెట్ వర్క్ అభివృద్ధిలో భాగముగా పాపయ్యరాజుపాలెం, పురుషోత్తపురం, వేపగుంట ప్రాంతములలో వాటర్ ఫ్లో మీటర్స్ అమర్చుట కొరకు 24 గంటలు తాటిపూడి ప్రధాన పైపులైన్ నిలుపుదల చేయడమవుతుందని తెలిపారు. ఉత్తరాపల్లి బెలన్సింగ్ రిసర్వాయర్ సమీపంలో తాటిపూడి 900 ఎంఎం వ్యాసము గల ఎంఎస్ పంపింగ్ పైప్ లైన్ రీరూటింగ్ పనులు చేయు నిమిత్తం తేది 16.05.2025 న అనగా శుక్రవారం ఉదయం 11.30 గంటలు నుండి తేది 17.05.2025 న అనగా శనివారం ఉదయం 11:30 వరకు అనగా 24 గంటలు సమయము మంచి నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుందన్నారు. తాటిపూడి ప్రధాన పైప్ లైన్ పైన ఉన్న బల్క్ ఇండస్ట్రీస్ వినియోగదారులు కు మరియు జోన్-8 పరిధిలో ఉన్న వార్డ్-93 నుంచి వార్డ్-98లో ఉన్న సాయి దుర్గా నగర్, దుర్గా నగర్, కృష్ణా నగర్. అప్పలనరసింహం కాలనీ, వెంకట సాయి నగర్, బంట కాలనీ, రవి నగర్, లక్ష్మీపురం, పోర్ట్ కాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్ బి కాలనీ, గోకుల్దాంకాలనీ, రెల్లివీది, కృష్ణరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్ఐసి కాలనీ, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీది, Z.P. హెచ్ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతి నగర్, VUDA కాలనీ, రైల్వే కాలనీ, ప్రశాంతి నగర్, సావిత్రి నగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడివివరం, SC కాలనీ, పాత అడివివరం, అడివివరం, మొదలగు ప్రాంతముల లొ మంచి నీటి సరఫరా కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. పైన ఉదహరించిన ప్రాంతములలొ ట్యాంకర్ ద్వారా మంచి నీటి సరఫరా చేయబడుతుందని కార్యనిర్వహక ఇంజనీరు తెలియజేశారు. కావున ప్రజలకు త్రాగునీటి సరఫరాలో కలుగు అసౌకర్యానికి చింతిస్తూ మంచినీటి సరఫరా విభాగము, జీ.వి.ఎం.సి జోన్-8 పరిధిలో గల నగర ప్రజలు సహకరించవలసినదిగా కమీషనరు వారి తరపున కోరడమైనదని జీవీఎంసీ తాగునీటి విభాగం కార్యనిర్వహక ఇంజనీరు తెలియజేశారు.

## 15న తూర్పు నియోజకవర్గం పునః రూపకల్పన ప్రతిపాదనలకై సమావేశం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ లో ఉన్న ఎనిమిది జోన్ల పరిధిలో పరిపాలనా సౌలభ్యం నేపథ్యంలో తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పునః రూపకల్పన చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయుటకు 15వ తేదీన సమావేశం నిర్వహించబడునని 3వ జోన్ జోనల్ కమిషనర్ శివప్రసాద్ బుధవారం పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఈ సందర్భంగా విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిధి పునః రూపకల్పనకై ఆశీలుమెట్ట జోన్-3 కార్యాలయం లోని సమావేశ మందిరము నందు తే 15.5.2025 (గురువారం) సాయంత్రం 5.00 గంటలకు 3వ జోనుకు సంబంధించి ప్రజా ప్రతినిధులు, నివాసిత సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాలలో అనుభవజ్ఞులైన పౌరుల సూచనలు సలహాలు స్వీకరించుటకై సమావేశాన్ని ఏర్పాటు చేయడమైనదని ఆయన తెలిపారు.

## రామప్ప ఆలయానికి చేరుకున్న ప్రపంచ సుందరీమణులు

### గుస్సాడీ నృత్య ప్రదర్శనలతో కళాకారుల స్వాగతం






ములుగు: ములుగు జిల్లా రామప్ప ఆలయానికి బుధవారం ప్రపంచ సుందరిమణులు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర ఎస్పీ శబరిష జిల్లా అధికారులు టూరిజం శాఖ అధికారులు ప్రపంచ సుందరి మహిళలకు ఘన స్వాగతం పలికారు. గుస్సాడీ నృత్య ప్రదర్శన ఒగ్గడోలు ప్రదర్శన ద్వారా కళాకారులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలోకి చేరుకున్న సుందరిమణులు ఎవరికి వారే స్వయంగా కాళ్లు కడుక్కొని పూజలు చేసేందుకు ఆలయంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సిబ్బంది వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత చరిత్ర ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పురాతన ఆలయం రామప్ప ఆలయాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఆలయ తీరుతన్నులను తనివి తీర తిలకించి ఫిదా అయ్యారు.

## రావికమతం ప్రభుత్వ ఆసుపత్రిలో లో రెండవ మెడికల్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన డి పుష్పలత



రావికమతం, (విశాఖ సమాచారమ్):- మండల కేంద్రం అయిన రావికమతం గ్రామం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మెడికల్ ఆఫీసర్ గా మొదట (డా శ్రీనివాస్ ) రెండవ వైద్యఅధికారిణిగా (డా పుష్పలత) బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఉద్యోగం మొదటి పోస్టింగ్ రావికమతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే అని చెప్పారు. 24/7 అన్నివేళలా వైద్యానికై అందుబాటులో ఉండే విధంగా రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. లేడీ డాక్టర్ లేక గర్భిణి స్త్రీలు తమ ఆరోగ్య సమస్యలను చెప్పుకోలేక ప్రవేట్ హాస్పిటల్ లో లేడీ డాక్టర్ వద్దకు వెళ్లిన రోలులెన్నో ఇకమీదట ఆ సమస్య పరిష్కారం అయ్యింది అని స్థానిక పేషెంట్ లు చెబుతున్నారు.

## ఆర్టీజీఎస్‌ను సందర్శించి మలావి దేవ ప్రతినిధి బృందం




అమరావతి, (విశాఖ సమాచారమ్):- రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కేంద్ర కమాండ్ కంట్రోల్ రూమును ఆగ్నేయ ఆఫ్రికాలోని మలావి దేశ ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. మలావి నేషనల్ వాటర్ రిసోర్స్ అథారిటీకి చెందిన ప్రతినిధులు రాష్ట్రంలోని జలవనరుల పరిక్షణలో ఏపీ అవలంభిస్తున్న మంచి విధానాలను అధ్యయనం చేయడానికి వచ్చారు.

ఈ సందర్భంగా వారు ఆర్టీజీఎస్ ను కూడా సందర్శించారు. వీరికి ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ స్వాగతం పలికి ఆర్టీజీఎస్ పనితీరును వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా తీసుకెళ్లడంలో తమ సంస్థ అందిస్తున్న సాంకేతిక సదుపాయాల గురించి వివరించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఆర్టీజీఎస్ ఒక వారధిలా పని చేస్తోందని తెలిపారు. పరిష్కారవేదిక ద్వారా ప్రజల నుంచి అందే అర్జీలను పరిష్కరిస్తున్న తీరు గురించి వివరించారు. మలావి నేషనల్ వాటర్ రిసోర్స్ అథారిటీ సీఈఓ డ్వైట్ కంబుకు మాట్లాడుతూ ఆర్టీజీఎస్ పనితీరు ఆదర్శప్రాయంగా ఉందని కొనియాడారు. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి సాంకేతిక సొబగులతో ఏర్పాటు చేసుకున్న ఇలాంటి వ్యవస్థ అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఈ కారక్రమంలో ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ ఎం.మాధురి తదితరులు పాల్గొన్నారు.

## కీర్తిక అభినవకు ఏపీజేఆర్సీలో 3వ ర్యాంకు



తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):- బల్లిపాడు గ్రామానికి చెందిన కొడమంచిలి అబ్బులు కుమార్తె కొడమంచిలి కీర్తిక అభినవ ఈరోజు విడుదలైన ఏపీజేఆర్సీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు విద్యార్థులు ఆమెను అభినందించి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏపీ 'గురుకుల' ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదల

అమరావతి, (విశాఖ సమాచారమ్):- ఏపీలో గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి.

ఫలితాలను ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ బుధవారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాల కోసం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ నిర్వహించగా.. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ ప్రవేశ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే.

ఈ ఫలితాల్లో టాపర్లు, అర్హత సాధించిన వారికి మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. మొత్తంగా 7190 సీట్లు అందుబాటులో ఉండగా.. 73,993మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 62,047మంది పరీక్ష రాసినట్లు తెలిపారు.

**ఫలితాలు పొందండి ఇలా..**

https://aprs.apcfss.in/ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయిన తర్వాత విద్యార్థులు ఐదో తరగతి, ఆరు, ఏడు, ఎనిమిదో తరగతి, ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీ పేజీల్లో తాము రాసిన తరగతికి సంబంధించిన పేజీని ఎంచుకోవాలి. ర్యాంక్ రిజల్ట్‌పై క్లిక్ చేయాలి. అక్కడ క్యాండిడేట్ ఐడీ, పుట్టిన తేదీ, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి ర్యాంక్ కార్డులను పొందొచ్చు.

## కొన ఊపిరితో మహిళ .. తుప్పల్లో 16 గంటలు



అల్లవరం: రాత్రంతా అంధకారం.. ఉదయం మండే ఎండ.. విషకీటకాలు తిరిగే తుప్పల్లో ఓ మహిళ 16 గంటలకు పైగా అచేతన స్థితిలో గడిపింది. ఆ మార్గంలో వెళ్లేవారు కొందరు చూడటంతో ఆమె ప్రాణాలు దక్కాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఓ మహిళలపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మంగళవారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో అల్లవరం సడక్ రోడ్డు సత్తెమ్మతల్లి గుడి సమీపంలో తుప్పల్లో ఓ మహిళ అపస్మారక స్థితిలో తలపై గాయంతో పడి ఉండటం స్థానికులు గమనించారు. 112 నంబరుకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమెను అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళగా(30)గా గుర్తించారు. గోసంగివారి పేటకు చెందిన ఓ వ్యక్తి సోమవారం రాత్రి తనను తీసుకువెళ్లి దాడి చేసినట్లు ఆసుపత్రిలో స్పృహలోకి వచ్చిన తర్వాత చెప్పినట్లు సమాచారం. అత్యాచారం జరిగిందా? అనే విషయం వైద్య పరీక్షల్లో తేలనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విశాఖ సమాచారమ్

గురువారం 15-5-2025

# మూడో పక్షం తలదూర్చిందా?

భారత్ - పాకిస్తాన్‌ల మధ్య వివాదాలన్నీ ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలనేది చాలా కాలంగా భారత్ అనుసరిస్తున్న స్థిరమైన విధానం. కశ్మీర్ అంశాన్ని తొలి రోజుల్లో ఐక్యరాజ్యసమితి వద్దకు తీసుకుపోవడం వలన నష్టం జరిగిందనే అభిప్రాయం సర్వత్రా ఉంది. పాక్, భారత్‌ల మధ్య రెండు కీలకమైన ఒప్పందాలున్నాయి. 1972 నాటి సిమ్లా ఒప్పందం, 1999లో ప్రకటించిన లాహోర్ డిక్లరేషన్. రెండు దేశాల నడుమ ఏ వివాదం తలెత్తినా ఈ రెండు ఒప్పందాల పరిధిలో, ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ చాలా కాలంగా దృఢమైన వైఖరితో ఉండేది. మూడో పక్షం మధ్యవర్తిత్వాన్ని భారత్ ఏనాడూ అంగీకరించలేదు. ఇందుకు భిన్నంగా రెండు దేశాల వివాదంలో ఇప్పుడు మూడో పక్షం తలదూర్చిందా? కాల్పుల విరమణకు భారత్, పాకిస్తాన్ దేశాలు అంగీకరించాయనీ, ఇది వెంటనే అమల్లోకి వస్తుందనీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అమెరికా మధ్య వర్తిత్వం వహించి, రాత్రంతా చర్చలు జరిపిన ఫలితంగా ఈ ఒప్పందం సాధ్యమైందని కూడా ఆయన వెల్లడిరచారు. ఆ ప్రకటన తర్వాతే విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాతో మాట్లాడారు. కాల్పుల విరమణకు రెండు దేశాలూ అంగీకరించాయని ఆయన ధ్రువీకరించారు. అయితే ఆయన ట్రంప్ ట్వీట్ ప్రస్తావన గానీ, అమెరికా మధ్యవర్తిత్వం గురించి గానీ మాట్లాడలేదు. పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో), ఇండియా డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ప్రతిపాదించారు. ఇద్దరి మధ్య ఒప్పందం కుదిరిందని మిస్రీ చెప్పారు. మూడో పక్షం జోక్యం లేకుండానే ఇరు దేశాలూ ఒప్పందానికి వచ్చాయనే విధంగానే ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత ట్వీట్ చేసిన విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంగానే దీన్ని అభివర్ణించారు. ఆ తర్వాత రెండు దేశాల డీజీఎంవోలు హాట్‌లైన్‌లో చర్చలు జరిపినా వివరాలు వెల్లడిరచలేదు. రెండు దేశాల డీజీఎంవోలు మాట్లాడుకోవడానికి ముందు నుంచే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో రెండు దేశాల ముఖ్య నేతలతో మాట్లాడుతున్నట్టుగా వార్తలు వెలువడ్డాయి. ఈ మొత్తం వ్యవహారంలో అమెరికా నిర్వహించిన పాత్రేమిటన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఉద్రిక్తతల సడలింపునకు కాల్పులు విరమణ పాటించాలని స్నేహపూర్వక సలహా మాత్రమే రెండు దేశాలకు ఇచ్చిందా? లేక చర్చల ప్రాతిపదికను తయారు చేసే మధ్యవర్తిత్వ పాత్ర పోషించిందా? ఒకవేళ మధ్యవర్తిగానే చర్చల ప్రాతిపదికను కూడా సిద్ధం చేసి ఉంటే దక్షిణాసియా భౌగోళిక రాజకీయాల్లో ఒక కీలకమైన మార్పు వచ్చినట్టే భావించాలి.

యుద్ధం అమానుషమై నది. అనాగరికమైనది. యుద్ధం కారణంగా దేశాలు, ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. యుద్ధ ప్రమాదాన్ని నివారించడం వివేకవంతమైన చర్యే! అయితే యుద్ధం భారత్ ప్రారంభించలేదు. ఉగ్రవాదాన్ని ప్రయోగించి పాకిస్తానే కయ్యానికి కాలు దువ్వింది. బదులుగా పాక్‌లోని ఉగ్రవాద స్థావరాల మీద మాత్రమే భారత్ దాడులు చేసింది. నూరు శాతం కచ్చితత్వంతో చేసిన ఈ దాడులు పదును దేలిన భారత రణ వ్యూహానికీ, అద్భుతమైన సైనిక పాటవానికీ అద్దం పట్టాయి. భారత దాడులకు పాక్ నివ్వెరపోయింది. అధీన రేఖ వెంబడి విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడిరది. జనావాసాలను టార్గెట్‌గా చేసుకొని దాడులకు దిగింది. ప్రాణనష్టం, ఆస్తి నష్టం భారీగానే జరిగినట్టు కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పరోక్షంగా అంగీకరించారు. మిగిలిన సరిహద్దు రాష్ట్రాల కంటే జమ్మూకశ్మీర్ ఈ దారుణాన్ని ఎక్కువగా భరించవలసి వచ్చింది. పసిపిల్లలతో సహా సాధారణ ప్రజలను బలి తీసుకుంటున్న మహమ్మారి యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని కశ్మీర్ ప్రతిపక్ష నేత మెహబూబా ముఫ్తీ కన్నీళ్ళతో వేడుకున్నారు.

యుద్ధాలను వేగిరపడి ప్రారంభించడం కాకుండా పూర్తి ప్రణాళికను రచించుకొని మొదలుపెట్టాలనీ, వీలైనంత వేగంగా ముగించాలనీ, శత్రువు ప్రతిఘటనా శక్తిని దెబ్బకొట్టి పోరాడకుండానే యుద్ధాలను గెలిచే మార్గాలను అన్వేషించాలనీ సన్‌ఘా తన యుద్ధతంత్ర గ్రంథమైన 'ఆర్ట్ ఆఫ్ వార్'లో చెబుతాడు. నాలుగు రోజుల భారత దాడుల్లో సన్‌ఘా చెప్పిన 'ఆర్ట్ ఆఫ్ వార్' కనిపించింది. ఉగ్రవాద స్థావరాలపై గురి తప్పకుండా, సరిహద్దులు దాటకుండా దాడి చేయడం, పలువురిని మట్టు పెట్టడంతోనే భారత్ సగం యుద్ధాన్ని గెలిచింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేయడం, ఎనిమిది కీలకమైన ఎయిర్ బేస్‌లను దెబ్బతీయటం, బాలిస్టిక్ మిసైల్‌ను గాల్లోనే పేల్చేయడంతో పాకిస్తాన్ దాదాపుగా చేతు లెత్తేసింది. ఈ దశలోనే పాక్ నేతలు అమెరికా శరణు కోరి ఉంటారనీ, అవమానకరమైన ఓటమి నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేసి ఉంటారనీ అంచనాలు వెలువడుతున్నాయి. అమెరికా జోక్యం చేసుకున్న విషయం యథార్థం. అది ఏ మేరకు అన్నది తేలవలసి ఉన్నది.

# 'గోదావరి' గుండెల్లో చిరంజీవి.. కాటన్ దొర

## నేడు జయంతి సందర్భంగా..



'కాటన్ దొర' అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకొనే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ (మే 15, 1803 – జూలై 24, 1899) బ్రిటిషు సైనికాధికారి, నీటిపారుదల ఇంజనీరు. సర్ ఆర్థర్ కాటన్ 18 ఏళ్ల వయసులో భారతదేశానికి వచ్చి మొదటిసారిగా మద్రాస్‌లో ఉద్యోగంలో చేరారు. అప్పటి బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ ఈయనను దక్షిణ ప్రాంత చెరువుల శాఖకు ఇంజనీర్‌గా నియమించింది. ఆయన నిరంతరం ప్రజల సంక్షేమం, సేవ కోసమే పరితపించేవారు. 18వ శతాబ్దంలో పవిత్ర జీవనదికి ఇరువైపుల ఉన్న ఉభయగోదావరి జిల్లాలు అతివృష్టి , వరద ముంపు, అనావృష్టి , కరువుకాటకాలతో విలవిలలాడాయి. 1833లో అనావృష్టి వల్ల కలిగిన కరువుతో రెడు లక్షల ప్రజలు తుడిచుపెట్టుకు పోయారు. అలాగే 1839లో ఉప్పెన, కరువు మరింతమందిని పొట్టనపెట్టుకొంది. దీంతో గోదావరి నది నీటికి అడ్డుకట్ట కట్ట వేయాలని కాటన్ అనుకున్నారు. తన ఆలోచనలను నిజం చేస్తూ జలాశయం నిర్మించారు.

సముద్ర మట్టానికి 1600 అడుగుల ఎత్తున నిర్మించాలని ప్రతిపాదించిన జలాశయాన్ని, కొన్ని నదుల అనుసంధానాన్ని బ్రిటీష్ ప్రభుత్వం అనుమతించలేదు. దాన్ని ప్రభుత్వం వ్యతిరేకించడానికి కారణం.. వాటివలన కలిగే ఇబ్బందులు కాదు. పెట్టుబడి ఎంత?.. వచ్చే రాబడి, కట్టాల్సిన వడ్డీ ఎంత?.. అంటూ లెక్కలు వేయటం. బ్రిటీష్ ప్రభుత్వ వాదనను కాటన్ వ్యతిరేకించారు. పాలితుల సుఖాలు, ప్రాణాలు కరువుతో ముడిపడి ఉన్నాయని, పాలకులు ధర్మంగా, బాధ్యతగా కరువు నివారణ పనులు చేపట్టాలని పోరాటం జరిపారు. ఫలితంగా గోదావరిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట రూపొందింది. 1847 – 52 మధ్య కాలంలో గోదావరిపై తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద ఆనకట్టను పూర్తిచేశారు. దీంతో క్షామపీడితమైన గోదావరి డెల్టా సస్యశ్యామలమై కలకలలాడిరది. తగ్గిపోతున్న జనసంఖ్య మూడు రెట్లు పెరిగింది. ఆరు లక్షల ఎకరాల భూమి సాగు కిందికి వచ్చింది. ఈ మహత్కార్యాన్ని ఆయన కేవలం అయిదేళ్లలో పూర్తి చేయడం గమనార్హం. కాటన్ దొర గోదావరిపై నిర్మించిన ఆనకట్ట, ఉభయగోదావరి జిల్లాలలోని రైతుల ఆర్థిక, జీవనగతులను మార్చేసింది. తమపాలిట దుఃఖదాయినిగా ఉన్న గోదావరిని, ప్రాణహితగా మార్చిన భగీరథుడుగా కాటన్ దొర ఈ రెండు జిల్లాల ప్రజలగుండెల్లో నిలచిపోయాడు.

ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణానంతరము, పండితులు గోదావరిలో స్నానమాచరించి, ఇలా సంకల్పం చెప్పుకునేవారు.

నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయోమహామతిః
స్మరామ్యాంగ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం

(మాకు గోదావరి నదీ స్నాన పుణ్యాన్ని కలిగించిన అపర భగీరథుడు, ఆంగ్ల దేశీయుడైన కాటన్ దొరగారిని ప్రతినిత్యం స్మరించి తరిస్తున్నాము. అని ఈ శ్లోకానికి తాత్పర్యం)

ఉభయ గోదావరి జిల్లాలలోని చాలా గ్రామాల్లో ఇతరదేశ నాయకుల విగ్రహాలున్నా, లేకపోయినా తప్పనిసరిగా కన్పించే విగ్రహం గుర్రం మీద స్వారీచేస్తున్న కాటన్ దొర. బ్రిటీషు వారు మనదేశాన్ని వదిలిపెట్టి పోయినా.. ధవళేశ్వరం బ్యారేజి నిర్మించి 150 ఏళ్లు గడిచినా గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో కాటన్ దొర ఇంకా చిరంజీవిగా ఉన్నారంటే ఆ కృషి ఎలాంటిదో అర్థమవుతోంది. నేడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయన్ని ఒక్కసారి స్మరించుకుందాం.

డా. జొన్నకూటి ప్రమోద్‌కుమార్

# శక్తివంతమైన బంధం కుటుంబ వ్యవస్థ

## నేడు అంతర్జాతీయ కుంటుబ దినోత్సవం




కష్టం-సుఖం, బాధ-ఆనందం, ఆత్మీయత-అనురాగం అన్నీ కలగలిసిన అద్భుత ప్రపంచం.. కుటుంబం. అరుగులపై అందరూ కలిసి కథల్ని, కలల్ని, మాటల్ని, రంగుల్ని, రంగవల్లుల్ని, అన్ని వివరాలు చెప్పేదే కుటుంబం. మన సాంప్రదాయ భారతీయ సమాజానికి పటిష్టతనూ దృఢత్వాన్నీ అందిస్తున్న శక్తి.. శతాబ్దాలుగా మనందర్నీ కలిసికట్టుగా ఉంచిన ఒక శక్తివంతమైన బంధం.. మన సుసంపన్నమైన సామాజిక యవనికను వైవిధ్యంగా మార్చి ఒక సమగ్ర రూపంగా మార్చేదే కుటుంబ వ్యవస్థ. అలాంటి కుటంబ వ్యవస్థ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే 'అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం' ముఖ్య ఉద్దేశ్యం. నేటికాలంలో సమాజంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న ఈ నేపథ్యంలో కుటుంబాల విలువలను తెలియజేయడంకోసం అంతర్జాతీయ కుంటుబ దినోత్సవాన్ని ప్రతి ఏడాది మే 15న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. యున్కెటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ 1993లో తొలిసారి ఈ సంప్రదాయానికి తెర తీసింది. భారతీయ సంస్కృతికి,సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందుపర చబడి ఉంది. నాగరిక ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబవ్యవస్థ మూడుపు వ్వులు ఆరు కాయలుగా వర్థిల్లింది. మనదేశంలో ఉమ్మడి కుటుంబాలు సిరిసంపదలతో తూలతూగాయనడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి.

కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న నేపథ్యంలో కుటుంబాల విలువలను తెలియజేయడంకోసం ఈ కుటుంబ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. గతంలో మాదిరిగా ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు ఉండడం లేదు. ఈ పరిణామం వల్ల ఒంటరితనం పెరిగిపోయి వ్యసనాలకు బానిసలు కావడం, పట్టించుకునేవారు లేకపోవడంతో మహిళలపై పనిభారం పెరిగి వారి ఆరోగ్యం దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

దీని కారణంగా సమాజంలో జరిగే దుష్పరిణామాలు గ్రహించిన ఐక్యరాజ్య సమితి కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం 1993, మే 15ని అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం ప్రకటించి వేడుకగా జరపడం ప్రారంభించింది. ఈ రోజున కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం అనే అంశాన్ని వివరిస్తూ ప్రజా చైతన్యంకోసం ప్రపంచవ్యాప్తంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం వంటివి చేస్తారు. 1993 నుంచి మొదలైన ఈ కార్యక్రమంలో ప్రతి ఏడాది ఒక అంశం థీమ్‌గా ప్రకటించి ఆ దిశగా ప్రజా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. మన సమాజంలో కుటుంబాలు పోషించే కీలక పాత్రను, ప్రాముఖ్యతను, వారు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, జనాభా సమస్యల గురించి అవగాహన పెంచడానికి, సమాజం లో కుటుంబం కీలక పాత్రను బాగా అర్థం చేసుకోవడానికి, ప్రపంచవ్యాప్తంగా కుటుంబాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, అంతర్జాతీయ సమాజాన్ని ప్రోత్సహించడానికి ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవం రోజును ఏర్పాటు చేసింది. ఒక రకంగా భావిస్తే, అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం మన కుటుంబాలలో మేము పంచుకునే ప్రేమ, బంధం, సంబంధాల మద్దతును జరుపుకునే రోజు గా భావించవచ్చు. సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందుతున్నప్పటికీ, సమాజంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న విషయాన్ని గుర్తించి, కుటుంబ విలువలను తెలియజేయడం కోసం, ఉమ్మడి కుటుంబాల అవసరం గురించి వివరించడం కోసం ఈ రోజును ప్రత్యేకంగా కేటాయించారు.

# ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన "సర్వేపల్లి"

**చిరస్మరణీయులు**



"ఒక అధ్యాపకుడు మైసూర్ విశ్వవిద్యాలయం నుంచి కలకత్తా విశ్వవిద్యాలయానికి పనిచేయడానికి వెళుతున్నాడు.మైసూర్ మహారాజు ఆయనపై గౌరవంతో రైల్వేస్టేషన్ వరకు వెళ్లడానికి గుర్రపు బండి పంపారు. ఆ అధ్యాపకుడు బండి ఎక్కి కుర్చోగానే కొందరు విద్యార్థులు వచ్చారు.బండికి కట్టిన గుర్రాలను వదిలివేశారు.బండి కాడిని తాము మోస్తూ రైల్వేస్టేషన్ వరకూ గురువును ఊరేగింపుగా తీసుకు వెళ్లారు.ఇది 1921 లో జరిగింది.అంతటి గౌరవం పొందిన తొలి ఉపాధ్యాయుడు డా,సర్వేపల్లి రాధాకృష్ణన్.అప్పుడు బండి లాగిన శిష్యుల్లో ఉన్న విద్యార్థి ఆ తరువాత కర్ణాటక ముఖ్యమంత్రిగా చేసిన నిజలింగప్ప కావడం విశేషం."

రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిని పవిత్రమైనదిగా భావించి విద్యాబోధన చేసేవారు. అందుకే ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆయన పుట్టినరోజు చేసుకోడం విశేషం.సర్వేపల్లికి ఆంధ్రా,బెనారస్,ఢిల్లీ విశ్వవిద్యాలయాలకు వైఎస్ ఛాన్స్ లర్ గా పని చేసిన ఘనత సొంతం.'ఉపాధ్యాయులే దేశంలో అత్యున్నత ఆలోచన కలవారు' అని నమ్మేవారు.దేశ లౌకిక,అలౌకిక పునాది వారిపైనే ఉందనే వారు.విద్యార్థులకు ఆయన భోధన విలక్షణంగా ఉండేది.ఆయన ఉపన్యాసాలకు విద్యార్థులు ఆసక్తి చూపేవారు.

భారతదేశ మొట్టమొదటి ఉపరాష్ట్రపతి,రెండో రాష్ట్రపతి గా పనిచేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప తత్వవేత్త. 1962–67వరకూ రాష్ట్రపతిగా పనిచేసారు.సోవియట్ యూనియన్ రాయబారిగా 1949–52 వరకూ పనిచేసారు.భారతీయతాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే.1954లో భారతరత్న పురస్కారాన్ని పొందారు.నైట్ హుడ్, బ్రిటీష్ రాయల్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ వంటి ఉన్నత పురస్కారాలు పొందారు.

తమిళనాడు తిరుత్తణి లో 1888 సెప్టెంబర్ 5న వలస వెళ్లిన తెలుగు దంపతులు వీరాస్వామి, సీతమ్మలకు రాధాకృష్ణన్ జన్మించారు.వారిది పేద కుటుంబం.రాధాకృష్ణన్‌కు చదువంటే ప్రాణం. తండ్రి పూజారి పని చేయమంటే కాదని తిరుపతి మిషనరీ స్కూలులో చేరారు.ఆయన విద్యాభ్యాసం ఉపకార వేతనాలతో సాగింది. అరిటాకు కొనే స్తోమత లేక నేలనుశుభ్రం చేసుకుని భోజనం చేసేవారు. ఏనాడూఆయన ఆడంబరాలకూ పోలేదు.నెల్లూరుజిల్లా సర్వేపల్లి వారి అసలు స్వస్థలం.తండ్రి భూస్వామి వద్ద పనిచేసేవారు. బాల్యం తిరుత్తణి,తిరుపతిలో గడిపారు.16ఏళ్ల వయస్సులో మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో చేరాడు.అక్కడే పీజీ పూర్తి చేసాడు. రోజులో 12 గంటలపాటు పుస్తకాలు చదివేవారు. యాదృచ్ఛికంగా తత్వశాస్త్రం అభ్యసించాడు. వేదాంత వ్యవస్థలకు నైతికతకు చోటులేదనే ఆరోపణలపై తన డిగ్రీ థీసిస్ సమర్పించారు.ఆయన తన పరిశోధనా పత్రంలో " భారతీయ సంస్కృతికి సంబంధించిన హాగ్ తోపాటు ఇతర క్రైస్తవ ఉపాధ్యాయులు విమర్శలు నావిశ్వాసానికి భంగం కలిగించాయి.నేను ఆశ్రయించిన సాంప్రదాయక ఆధారాలను కదిలించాయి" అని తెలిపారు.

1903లో శివకామమ్మ ను వివాహం చసుకున్నారు. ఐదుగురు కుమార్తెలు,ఒక కుమారుడు జన్మించారు.క్రికెటర్ వివీఎస్ లక్ష్మణ్ ఆయన సమీప బంధువు.మద్రాసు,మైసూర్ లలో ఉపాధ్యాయుడిగా పనిచేసి కలకత్తా విశ్వవిద్యాలయానికి వెళ్లారు.అక్కడ తత్వ శాస్త్ర ప్రొఫెసర్ గా చేసారు.అక్కడే 'భారతీయ తత్వశాస్త్రం' అనేగ్రంథం రాసారు. అనేక విదేశీ విద్యాలయాల్లో ఉపన్యాసాలు ఇచ్చారు.1937లో నోబెల్ బహుమతి కి నామినేట్ అయ్యాడు. 1946లో రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. విద్యాసంస్కరణ కమిటీకి నాయకత్వం వహించారు.

ఆయన దృష్టిలో తత్వం జీవితాన్ని అర్థం చేసుకోవడానికి మార్గం.భారతీయ తత్వ చింతన ఏ విషయంలోనూ తక్కువ కాదని నిరూపించారు.రాష్ట్రపతిగా 25 శాతం మాత్రమే జీతం తీసుకుని,మిగిలినది ప్రధానమంత్రి సహాయ నిధికి ఇచ్చేవారు.రాష్ట్రపతిగా ఉండగా ఆయన శిష్యులు,అభిమానులు పుట్టినరోజును ఘనంగా చేస్తామని కోరగా ఆరోజు ఉపాధ్యాయులు దినోత్సవంగా గురువులను సత్కరించమని చెప్పి ఆవృత్తి అంటే తనకు ఇష్టమని చెప్పకనే చెప్పారు.అలాగే దానికి మించిన గొప్ప వృత్తి లేదని ప్రపంచానికి చాటారు.

యం.వి.రామారావు,8074129668

పంచాంగం

గురువారం 15-5-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, వసంత రుతువు
వైశాఖ మాసం

| | |
|---|---|
| తిథి | : బ. తదియ తె. 4.03 |
| నక్షత్రం | : జ్యేష్ఠ ప. 2.08 |
| వర్జ్యం | : రా. 10.49 ల 12.33 |

మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్
vspnews4@gmail.com
వాట్సాప్ నంబర్ : 9100986585.

# సైకిలిస్టులకు ప్రత్యేక మార్గం



సైకిల్ తొక్కే వారు ఈ ఎగుడుదిగుడు రోడ్లపై పోవడంవల్ల వారి శారీరక ఆరోగ్యానికి చాలా మంచిదని పాలకులు భావించారు.

అంతేకాకుండా ఈ ప్రయాణం సైకిలిస్టుల మనసుకి ఆహ్లాదంతోపాటు నూతనోత్సాహాన్ని ఇస్తుందట.

ఇక్కడ గమనించాల్సిన మరొక ముఖ్యమైన విషయమేమిటంటే మరే

హంగేరియాలోని నగర వీధుల్లో సైకిలిస్టుల కోసం ఓ ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఆ మార్గం ప్రత్యేకత ఏమిటంటే దారంతా ఎత్తుపల్లాలతో కూడి ఉంటుంది.

వాహనాలూ సైకిలిస్టుల కోసం ఏర్పాటు చేసిన దారిలో వెళ్ళే వీలు లేదు. అంటే ఆ దారి కేవలం సైకిలిస్టులకు మాత్రమే నిర్దేశించబడిందన్న మాట.

– యామిజాల జగదీశ్

# మరుగున పడుతున్న కొన్ని తెలుగు సామెతలు

1. అంత్యనిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు
2. అంబలి తాగే వారికి మీసాలు యెగబట్టేవారు కొందరా
3. అడిగేవాడికి చెప్పేవాడు లోకువ
4. అత్తలేని కోడలుత్తమురాలు కోడల్లేని అత్త గుణవంతురాలు
5. అనువు గాని చోట అధికులమనరాదు
6. అభ్యాసం కూసు విద్య
7. అమ్మబోతే అడివి కొనబోతే కొరివి
8. అయితే ఆదివారం కాకుంటే సోమవారం
9. ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం
10. ఇంట్లో ఈగల మోత బయట పల్లకీల మోత
11. ఇల్లు కట్టి చూడు పెళ్ళి చేసి చూడు
12. ఇంట గెలిచి రచ్చ గెలువు
13. ఇల్లు పీకి పందిరేసినట్టు
14. ఎనుబోతు మీద వాన కురిసినట్టు
15. చెవిటి వాని ముందు శంఖమూదినట్టు
16. కందకు లేని దురద కత్తిపీటకెందుకు
17. కత్తిపోటు తప్పినా కలంపోటు తప్పదు
18. కుక్క కాటుకు చెప్పుదెబ్బ
19. కోటి విద్యలూ కూటి కొరకే
20. నీరు పల్లమెరుగు నిజము దేవుడెరుగు
21. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం
22. పిట్ట కొంచెం కూత ఘనం
23. రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు
24. వాన రాకడ ప్రాణపోకడ ఎవరి కెరుక
25. కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదు
26. మింగమెతుకులేదు మీసాలకు సంపంగి నూనె
27. ఆడబోయిన తీర్థము యెదురైనట్లు
28. ఆడలేక మద్దెల వోడు అన్నట్లు
29. ఆది లోనే హంస పాదు
30. ఏమీ లేని యెడారిలో ఆముదము చెట్టే మహా వృక్షము
31. ఆకలి రుచి యెరుగదు నిద్ర సుఖమెరుగదు
32. ఆకాశానికి హద్దే లేదు
33. ఆలస్యం అమృతం విషం
34. ఆరే దీపానికి వెలుగు యెక్కువ
35. ఆరోగ్యమే మహాభాగ్యము

# విశాఖ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బుద్ధ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు. జీవీఎంసీ మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావును మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగజగదీశ్వరరావు ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తరపున డివి సుబ్బారావు తర్వాత రెండవ మేయర్ గా శ్రీనివాసరావుకు అధిష్టానం చాలా బాధ్యతను అప్పగించిందని, నాలుగు సంవత్సరాలు వైసిపి పాలనలో జీవీఎంసీని అధోగతి పాలు చేసి అభివృద్ధి నిరోధకులుగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని రుషికొండను నాశనం చేసి 500 కోట్లు ఖర్చుపెట్టి జగన్ రెడ్డి నివాసంగా నిర్మించి ప్రజాధనం దుర్వినియోగం చేశారని, ముఖ్యంగా విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ అన్ని జోన్ల లో పారదర్శకంగా అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే విధంగా కృషి చేయవలసిన ఆవశ్యకత ఉందని నాగ జగదీష్ అన్నారు.

# మాజీ సర్పంచికి నివాళులర్పించిన టిడిపి యువగళం నేత సత్యేంద్ర



**(గజ్జరం: విశాఖ సమాచారమ్ కొవ్వూరు నియోజకవర్గ ప్రతినిధి కొల్లి చిన్నబాబు) :–**

గజ్జరం టీడీపీ దళిత నేత,మాజీ గ్రామ టీడీపీ సర్పంచ్ శ్రీ మల్లిపూడి చిన్న రాములకి శ్రద్ధాంజలి ఘటించి వారి యొక్క కుటంబానికి ధైర్యాన్ని ఇచ్చిన టీడీపీ నాయకులు మరియు రాష్ట్ర,జిల్లా దళిత నేతలు.

మల్లిపూడి చిన్నరాములు మరణ వార్త తెలుసుకుని వారి యొక్క కుటంబసభ్యులతో మాట్లాడుతున్న సందర్భంలో ఎన్నో పాత జ్యాపకాలను గుర్తు చేసుకోవటం జరిగింది

ఈ సందర్భంలో టీడీపీ నాయకులు కాకర్ల సత్యేంద్ర, దళిత నాయకులు తాళ్లపూడి మండల టీడీపీ ఉపాధ్యక్షులు శ్రీ తిగిరిపల్లి కనకరత్నం, జిల్లా ఎస్సీసెల్ యువ నాయకులు వరిగేటి కాంతారాజు, పెనకాలమెట్ట గ్రామనికి చెందిన జిల్లా ఎస్సీ నాయకురాలు సోమా లక్ష్మి, నియోజకవర్గ ఎస్సీ యువ నాయకులు కొడమంచిలి వెంకట రాజు, జాన్ బాబు, బొచ్చు శ్రీనుతో పాటుగా తదితరులు వారికి ధైర్యాన్ని ఇచ్చి అన్ని వేళల ఆదుకుంటామని పార్టీ పరంగా అన్ని రకాలుగా అండగా ఉండటమని మాట్లాడటం జరిగింది.

# ఉపాధి కూలీలకు అండగా తోట రామకృష్ణ



**(పెద్దేవం: విశాఖ సమాచారమ్ కొవ్వూరు నియోజకవర్గ ప్రతినిధి కొల్లి చిన్నబాబు):–**

పెద్దేవం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు ఎలా చేస్తున్నారో అని ఆకస్మిక తనిఖీలు చేసిన ఉప సర్పంచ్ తోట రామకృష్ణ అలాగే ఈ సందర్భంగా పని వివరాలు అడిగి తెలుసుకునీ, కూలీలు తో మమేకం అయ్యి వారి బాధలను అడిగి తెలుసున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ మేము పని చేస్తున్నాం గానీ డబ్బులు మాకు రావడం లేదని వాపోయారు.దీని పై తోట రామకృష్ణ మాట్లాడుతూ మీ సమస్య పరిష్కారం కొరకు ఆర్డీఓ ఎండీఓతో మాట్లాడుతానని తెలియచేశారు .కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

# ఉమ్మడి విశాఖ జిల్లాకు కూటమి ప్రభుత్వం కానుక: 33 హైస్కూళ్లు మంజూరు!

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** ఉమ్మడి విశాఖ జిల్లా కు నూతనంగా 33 హైస్కూలు విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ మంజూరు చేశారు .జి.ఓ. నెంబరు 117 సవరణలో భాగంగా ఈ జిల్లాకు ఈ స్కూళ్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడున్న యు.పి. స్కూళ్ల స్థానం లో ఆయా పాఠశాలలు ఉన్నతీకరించబడ్డాయి. అక్కడి విద్యార్థుల సంఖ్యను బట్టి ఆ పాఠశాలలు అప్ గ్రేడ్ అయ్యాయి.ఎస్.రాయవరం. : (బంగారమ్మ పాలెం, గోకులపాడు, గుర్రాజుపేట.)

అనకాపల్లి: ( బవులువాడ, కుంచంగి, ముత్రాసుకాలనీ) రామాపురం, సిరసపల్లి) భీమునిపట్నం: (చిన ఉప్పాడ.)చినగదిలి: (బక్కన్న పాలెం).


చింతపల్లి: (చౌడుపల్లి, కొత్త పాలెం, కృష్ణాపురం, తాజంగి) చీడికాడ: (దండి సురవరం, దిబ్బపాలెం)

అచ్యుతాపురం: (దిబ్బ పాలెం)హుకుంపేట: ( దురువీధి) మాకవరపాలెం: (జి.వెంకటాపురం, జంగాలపల్లి) ముంచంగిపుట్టు (కర్రిముఖిపుట్టు) చోడవరం (ఖండేపల్లి) కోటఉరట్ల (కొడవటిపూడి) బుచ్చెయ్యపేట: ( మల్లాం)పాయకరావుపేట:

(పలమనపేట) యలమంచిలి: పెద్దపల్లి) పద్మనాభం: (పొట్నూరు)నక్కపల్లి.

( రమణయ్య పేట)సీతమ్మ ధార: (ఎమ్టి పాలెం)మహారాణిపేట: ( ఆర్బిఎంయుపి స్కూల్ వార్డు13) జికెవీధి (గవర్నమెంట్రింతాడ) అరుకువేలి: గవర్నమెంట్యుపిస్కూల్నందివలస) జి.మాడుగుల:( గవర్నమెంట్ యుపి స్కూల్ కృష్ణాపురం).

# పింఛన్ ఇచ్చి వెటరన్ జర్నలిస్టులను ఆదుకోండి



యంవీ రామారావు

**విజయవాడ, (విశాఖ సమాచారమ్):–** జర్నలిస్టులు సమాజానికి ప్రభుత్వానికి అనుసంధానకర్తగా ఉంటారు. అన్యాయం జరిగితే ఎత్తిచూపిస్తారు. ఎక్కడ వార్త ఉంటే అక్కడికి పరుగెత్తి కవర్ చేస్తారు. ఆదాయం సరిపడా రాకపోయినా వృత్తి పట్ల ఉన్న అభిలాష తో కొనసాగుతారు. వృత్తిలోనే ఆనందం వెతుక్కుంటారు. యుద్ధం సమయంలోనూ ప్రాణాలకు తెగించి వార్తా సేకరణ చేస్తారు. ఇటీవల ఆపరేషన్ సింధూర్' లో పలువురు జర్నలిస్టులు నిమిష నిమిషం వార్తలు సేకరించి ప్రజలకు అందించారు. జర్నలిస్టులకు పదవీ విరమణ తో పీఎఫ్ మాత్రమే వస్తుంది. అదీ వారు కట్టినది మాత్రమే. ఎంప్లాయర్ కట్టినది నామమాత్రంగా పెన్షన్ రూపంలో వెయ్యి కంటే తక్కువ వస్తుంది. అదీ వర్కింగ్ జర్నలిస్ట్ లకు మాత్రమే వస్తుంది. పార్ట్ టైం విలేకరులకు అదీరాదు. పదవీ విరమణ తరువాత వారి జీవితం దుర్భరంగా తయారవుతున్నది. కరోనా సమయంలో పలువురు సీనియర్ (వెటరన్) జర్నలిస్టులు మందులకు, చికిత్సకు డబ్బులు లేక దిక్కులేని చావుకు గురయ్యారు. మరికొందరు కనీసం ఆదాయం లేక మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయి. దేశంలో అనేక రాష్ట్రాల్లో జర్నలిస్టులపై గౌరవం, సానుభూతితో ప్రభుత్వాలు నెలకు ఐదు వేల నుంచి 20 వేల రూపాయలు వరకూ ఇస్తున్నారు. ఏపీలో వెటరన్ జర్నలిస్ట్ యూనియన్ తరపున గత ప్రభుత్వానికి, అప్పటి ప్రెస్ అకాడమీ అధ్యక్షుడిగా పలుమార్లు కనీసం పెన్షన్ ఇవ్వమని అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా వెటరన్ జర్నలిస్టులను పట్టించుకోవడం లేదు. సంవత్సరం పూర్తి అయినా వారి గూర్చి ప్రస్తావన లేదు. వెటరన్ జర్నలిస్టులు అక్రిడిడేషన్ ఉన్న వారు 200 మంది కూడా ఉండరు. వారికి కనీసం ఐదువేల రూపాయలు పెన్షన్ ప్రకటించాలి. లక్షల మందికి వృద్ధులకు,వికలాంగులకు, ఒంటరి మహిళలకు సామాజిక పింఛను ఇస్తున్నారు. 200 మంది వెటరన్ జర్నలిస్టులకు ఆమాత్రం ఇవ్వలేదా?. కేవలం ప్రెస్ అకాడమీ అధ్యక్షుడిని నియమించడంతో జర్నలిస్టులకు న్యాయం జరుగుతుందని భావించడం తప్పు. రాష్ట్రంలో ముందుగా అక్రిడిడేషన్ పొందిన వెటరన్ జర్నలిస్టులకు పింఛన్ మంజూరు చేయాలి. తరువాత ఇంకా ఉంటే కనీసం 20 సంవత్సరాలు పనిచేసిన వారికీ పెన్షన్ ఇవ్వాలి. ప్రభుత్వం ఈ విషయమై సత్వర చర్యలు తీసుకోవాలని ఏపీ వెటరన్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు యం.వి. రామారావు, కాకర్ల వెంకటరత్నం తదితరులు విజ్ఞప్తి చేశారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**
**వేలం ప్రకటన**
వేలం కేటలాగ్ నం. CAT-WCC-001
వివరణ: VNCW/విశాఖపట్నం వద్ద OEC, RYD, CSL మరియు విడిభాగాల లోడ్ల (C&W గుర్తించిన విధంగా) వద్ద ఖాళీ రేకుల తనిఖీ / పరీక్షించే సమయంలో శుభ్రం చేసిన వ్యాగన్ల నుండి వచ్చిన అవశేషాల తరలింపుతో పాటు శుభ్రపరచడం కోసం వ్యాగన్ శుభ్రపరిచే కాంట్రాక్టు.
ట్రిప్‌లు/రోజులు: 1096, లాట్ ప్రారంభ తేది & సమయం: 20.05.2025న 1100 గం.లకు లాట్ ముగింపు తేది & సమయం: 20.05.2025న 1130 గం.లకు
Min Incr (%): 0.2%
పై ఇ-వేలం ప్రకటన యొక్క పూర్తి సమాచారం వెబ్‌సైట్ https://www.ireps.gov.inలో లభించును.
సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ / వాల్తేరు
PR-126/Q/25-26

# ఆక్టోపస్ ఆధ్వర్యంలో ఎన్‌టీపీసీ సింహాద్రిలో మాక్ డ్రిల్



**పరవాడ, (విశాఖ సమాచారమ్):–** ఎన్టీపీసీ సింహాద్రి లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ కమాండో విభాగమైన ఆక్టోపస్ ఆధ్వర్యంలో "ఆపరేషన్ థండర్" పేరుతో సమగ్ర మాక్ డ్రిల్ నిర్వహించారు. డ్రిల్ ప్రణాళిక ప్రకారం, 6గురు ఉగ్రవాదులు ఆయుధాలతో ఎన్టీపీసీ కేంద్రంలో చొరబడి, బహిరంగంగా ఉన్న కొందరిపై కాల్పులు జరిపి, అనంతరం లోపలికి చొరబడినట్లు సమాచారంతో ఆక్టోపస్ బృందం హుటాహుటిన స్పందించింది. వ్యూహాత్మకంగా ఆపరేషన్‌ను ప్రారంభించి, ఉగ్రవాదులను "న్యూట్రలైజ్" చేసి, వారి చేతిలో బందీగా ఉన్న హొస్టేజెస్‌ను సురక్షితంగా రక్షించారు.ఈ డ్రిల్ అనకాపల్లి జిల్లా పోలీస్ సూపరిండెంట్ తుహిన్ సిన్హా మార్గదర్శకత్వంలో నిర్వహించారు. డ్రిల్ సజావుగా కొనసాగేందుకు ముందు నుంచే సమన్వయాన్ని మెరుగుపర్చే ఉద్దేశంతో ప్రత్యేక కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎన్టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ , సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్ కుమార్ , ఆక్టోపస్ అదనపు పోలీస్ అధికారి రాజా రెడ్డి , డీఎస్పీ వల్లం విష్ణు స్వరూప్ , పరవాడ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆర్. మల్లికార్జున రావు, అనకాపల్లి బాంబు స్క్వాడ్ సిబ్బంది, ఎన్టిపిసి, సిఐఎస్ఎఫ్ అధికారులు, మెడికల్, ఫైర్, రెవెన్యూ, సేఫ్టీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** విశాఖ స్టీల్ యాజమాన్యం క్రమశిక్షణ పేరుతో స్టీల్ కార్మికుల పై సస్పెన్షన్, షో కాజ్ నోటీసులు తక్షణం ఎత్తివేయాలని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు యాజమాన్యం డిమాండ్ చేశారు. నేడు స్టీల్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏఐటియుసి అధ్యక్షులు కె ఎస్ ఎన్ రావు అధ్యక్షత వహించారు.

ఈ ధర్నాను ఉద్దేశించి స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం క్రమశిక్షణ పేరుతో నియంతృత్వాన్ని ప్రదర్శిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కార్మికులను వారి హక్కులను కూడా కాలరాస్తూ నేడు యాజమాన్యం కార్మిక వర్గాన్ని తీవ్ర భయభ్రాంతు లోకి నెడుతోందని ఆయన వివరించారు. ఈ స్థితి కొనసాగదని యాజమాన్యం పునరాలోచించి తగు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాట మార్గాలను నిర్ణయించుకున్నదని అందులో భాగంగానే మే 20 వ తారీకు జరిగే సమ్మె అని ఆయన అన్నారు. నేడు స్టీల్ యాజమాన్యం కార్మికుల నాయకులకు షోకాజు నోటీసులు ఇవ్వాలనే దుర్మార్గపు ఆలోచనలను తక్షణం విరమించుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఐఎన్‌టిఎస్‌సి ప్రధాన కార్యదర్శి రమణ మూర్తి మాట్లాడుతూ కర్మాగారంలో ప్రజాస్వామ్యం, వాక్ స్వాతంత్రం విలువలకు తిలోదకాలు ఇస్తూ ప్రభుత్వ యాజమాన్యాల వ్యవహరిస్తున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే కర్మాగారంలో అశాంతి అలజడులు మరింత పెరిగి తద్వారా ఉత్పత్తి ఉత్పాదకతలు పై దీని ప్రభావం మరింత పడుతుందని ఆయన వివరించారు. కనుక యాజమాన్యం ఇటువంటి దుందుడుకు చర్యలను తక్షణం విరమించుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జి రామస్వామి, అధ్యక్షులు వైటి దాస్, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు రామ్ కుమార్, డివి రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు మాట్లాడుతూ యాజమాన్యం తన వైఖరిని తక్షణం మార్చుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు పి శ్రీనివాసరాజు, సుబ్బయ్య, బి అప్పారావు, తౌడన్న, కారు రమణ, దేముడు, టి ఎస్ ఎన్, టి వి కె రాజు, కె గంగాధర్, మరిదయ్య, పుల్లారావు, వి ప్రసాద్, జె రామకృష్ణ వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు మరియు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ సేవలు ప్రశంసనీయం



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):–** ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధిని కాంక్షించి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో యూజేఎఫ్ హ్యాండ్ బుక్ ను అయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూజేఎఫ్ విశాఖ జిల్లా శాఖ అధ్యక్షులు, ఏపియుడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షులు కే. రాము మాట్లాడుతూ జర్నలిస్టులు సామాజిక దృక్పథం తో సేవలందించాలనే సంకల్పం తో ఆవిర్భవించిన యూజేఎఫ్ అధ్యక్షులు డాక్టర్ ఎం.ఆర్.ఎన్. వర్మ ఆధ్వర్యంలో గత దశాబ్ద కాలానికి పైగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమాచార,పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి. రమేష్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జర్నలిస్టుల ఫోన్ నెంబర్లతో కూడిన యూజేఎఫ్ హ్యాండ్ బుక్ ప్రజలకు కూడ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సీనియర్ జర్నలిస్టు, యూజేఎఫ్ నాయకులు కే. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి లో యూజేఎఫ్ తన వంతు పాత్ర పోషిస్తుం దన్నారు. సీనియర్ జర్నలిస్టు మజ్జి గణపతి రావు ప్రసంగిస్తూ ఉత్తరాంధ్ర లో అన్ని మండలాల్లో యూజేఎఫ్ బృందం పర్యటించి వార్తా కథనాలు ప్రచురణ ద్వారా అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తుందని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు డి. హరనాథ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర చరిత్రకారుల గొప్పతనాన్ని తెలియజేసే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఏ.శివ, ప్రదీప్ పలువురు యూజేఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# హత్యకేసులో నిందితుడు ఎట్టకేలకు అరెస్టు



**గాజువాక:** వివాహిత హత్యకేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడిని ఎట్టకేలకు గాజువాక పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ అళహరి పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2017లో గాజువాక పీఎస్ పరిధిలోని గణపతినగర్‌లో ఓ మహిళ(40)తో సహజీవనం సాగిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా మల్లేశ్వరం గ్రామానికి చెందిన కుమ్మరి భాస్కర్ (35) ఆమెను హత్య చేసి పరారయ్యాడు. అప్పటి నుంచి గాజువాక పోలీసులు భాస్కర్ కోసం గాలిస్తున్నారు. ఎట్టకేలకు నిందితుడు భాస్కర్‌ను తెలంగాణలోని కల్వకుర్తిలో పట్టుకున్నారు. అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. గాజువాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## కరెంట్ ఎఫైర్స్ డీఎస్సీ

ప్ర(1). అథ్లెట్స్ కమిషన్ ఛైర్మన్‌గా అంజు బాబీ జార్జ్ ను ఎవరికి నియమించారు?
(ఎ) భారతీయ ఒలింపిక్ సంఘం
(బి) అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా
(సి) భారతీయ క్రీడాకారుల సంఘం
(డి) భారత క్రీడల మండలి
**జవాబు: బి**

ప్ర(2). 85వ ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ ఎక్కడ జరగనుంది?
(ఎ) ఢిల్లీ
(బి) పాట్నా
(సి) ముంబై
(డి) కోల్‌కతా
**జవాబు: బి**

ప్ర(3). పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రింగర్ లాక్టేట్ సొల్యూషన్‌ను ఏ సందర్భంలో నిషేధించింది?
(ఎ) వైద్య పరికరాల లోపం
(బి) భద్రతా సమస్యలు
(సి) కొత్త వైద్య పరిశోధనలు
(డి) వైద్య సాంకేతికతలు
**జవాబు: బి**

ప్ర(4). 77వ ఆర్మీ డే ఏ తేదీన జరుపుకుంటారు?
(ఎ) జనవరి 1
(బి) జనవరి 10
(సి) జనవరి 15
(డి) ఫిబ్రవరి 25
**జవాబు: సి**

ప్ర(5). మహారాష్ట్రలో పావనా నది పర్యావరణ సంబంధమైన చర్చలలో ఎలాంటి ప్రాముఖ్యత పొందింది?
పర్యావరణ (ఎ) ప్రాజెక్ట్ నిర్వహణ
(బి) పర్యావరణ మరియు సాంస్కృతిక ప్రాముఖ్యత
(సి) పశుపాలన సమస్యలు
(డి) వన్యప్రాణుల సంరక్షణ
**జవాబు: బి**

ప్ర(6). భారతదేశం ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన హైడ్రోజన్ రైలు ఇంజిన్‌ను ఎక్కడ రూపొందించింది?
(ఎ) ముంబై
(బి) ఢిల్లీ
(సి) కోల్‌కతా
(డి) తమిళనాడు
**జవాబు: బి**

ప్ర(7). భారతదేశం మరియు స్పెయిన్ 2026లో ఏ విషయంపై సహకరించనుంది?
(ఎ) వాణిజ్య సంబంధాలు
(బి) ద్వంద్వ సంవత్సరాన్ని జరుపుకోవడం
(సి) సైనిక సహకారం
(డి) సాంకేతిక అభివృద్ధి
**జవాబు: బి**

ప్ర(8). పిక్సెల్ ఏ రంగంలో ప్రముఖ ఘనతను సాధించింది?
(ఎ) ప్రపంచకప్ నక్షత్ర వేదిక
(బి) శాటిలైట్ కాన్‌స్టెలేషన్
(సి) అంతరిక్ష ప్రక్షేపణ
(డి) శాటిలైట్ అప్లికేషన్స్
**జవాబు: బి**

ప్ర(9). తెలంగాణలో కనుమ పశువుల పండగను ఏ ఉద్దేశ్యంతో జరుపుకున్నారు?
(ఎ) పశుపాలన ఆవగమనానికి
(బి) వ్యవసాయ పద్ధతులు మరియు సాంప్రదాయం
(సి) కార్తీక పూర్ణిమలో ప్రత్యేక పూజలు
(డి) దక్షిణ భారత సాంప్రదాయం
**జవాబు: బి**

ప్ర(10). ఒడిశా ఎమర్జెన్సీ ఖైదీలకు ఎలాంటి సౌకర్యం ప్రకటించింది?
(ఎ) విద్యుత్ సబ్సిడీ
(బి) పెన్షన్
(సి) ఆరోగ్య బీమా
(డి) రాష్ట్రీయ అవార్డులు
**జవాబు: బి**

ప్ర(11). మణిపూర్‌లో గాన్-న్గై 2025 ఫెస్టివల్ ఏ వర్గం సంస్కృతిని ప్రదర్శిస్తుంది?
(ఎ) మాగై రియోంగ్
(బి) జెలియాంగ్‌రోంగ్ కమ్యూనిటీ
(సి) దార్జిలింగ్ కమ్యూనిటీ
(డి) బెంగాలీ సంస్కృతి
**జవాబు: బి**

ప్ర(12). ఆసియాలో రెండవ అతిపెద్ద ఇస్కాన్ దేవాలయం ఎక్కడ ప్రారంభించబడింది?
(ఎ) ముంబై
(బి) నవీ ముంబై
(సి) హైదరాబాద్
(డి) కోల్‌కతా
**జవాబు: బి**

ప్ర(13). ఐఎన్ఎస్ ఉత్కర్ష్ భారత నౌకాదళం కోసం ఏం ప్రారంభించబడింది?
(ఎ) పసుపు ఉత్పత్తి
(బి) బహుళ ప్రయోజన నౌక (ఎంపీవీ)
(సి) పరామర్శ సబ్‌మరీన్
(డి) సైనిక హెలికాప్టర్
**జవాబు: బి**

ప్ర(14). ఐసీసీ ప్లేయర్స్ ఆఫ్ ది మంత్‌గా ఎవర్ని ఎంపిక చేశారు?
(ఎ) అనాబెల్ సదర్లాండ్ మరియు జస్ప్రీత్ బుమ్రా
(బి) రహీల్ పటేల్ మరియు మోస్టాఫా జబీర్
(సి) ధోని మరియు కోహ్లీ
(డి) హర్దిక్ పాండ్యా మరియు షారుఖ్ ఖాన్
**జవాబు: ఎ**

ప్ర(15). డిజిసిఏ హెడ్‌గా ఎవరు నియమితులయ్యారు?
(ఎ) జయంత్ కుమార్
(బి) ఫైజ్ అహ్మన్ కిద్వాయ్
(సి) సునీల్ వర్ధన్
(డి) విజయ్ గహలోత్
**జవాబు: ఎ**

ప్ర(16). మహిళల అండర్-19 వన్డే ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణి ఎవరు?
(ఎ) ఇరా జాదవ్
(బి) మిథాలీ రాజ్
(సి) హర్మన్‌ప్రీత్ కౌర్
(డి) ఋషి రాజ్
**జవాబు: ఎ**

## నేనొక వేళ యుద్ధంలో మరణిస్తే...?

నా పార్థివ దేహాన్నిశవపేటికలో
పెట్టి ఇంటికి చేర్చండి!
సాధించిన శౌర్య పతకాల్ని
నా చాతిపై మెరిపించండి!
నాశక్తివంచనలేకుండా
తన వాగ్దానాన్ని నెరవేర్చిన ధైర్యశాలని
నా కన్న తల్లికి చెప్పండి
నన్ను చూసి క్రుంగి పోవద్దని
నా కన్నతండ్రికి చెప్పండి-
ఇకపై ప్రతిక్షణం నాకోసం
ఆందోళన అవసరంలేదని చెప్పండి!
బాగా చదువుకోమని
ఇకపై నా బైకు తాళాలు
వాడినే శాశ్వతంగా దాచుకోమని
నా ప్రియమైన తమ్ముడికి చెప్పండి!
ఇంకా నేను రాలేదని నిరీక్షించే
నా ముద్దుల చెల్లెల్ని నిరాశ పడొద్దనీ
సూర్యాస్తమయం తర్వాతనే
నేను శాశ్వతంగా విశ్రాంతి
తీసుకున్నానని చెప్పండి!
నా కోసం కన్నీళ్ళు కార్చొద్దని నా ప్రియమైన దేశానికి చెప్పండి
నేను మీకోసం మరణించడానికే
సైనికుణ్ణియ్యానని చెప్పండి!
-ఒక భారతసైనికుడు.

(మన భారత వీరసైనికుడు తమ తల్లిదండ్రులకు రాసిన చివరి కవితాత్మక లేఖగా వైరల్ అవుతున్న పోస్టుకి అశ్రునయనాలతో నా స్వేచ్ఛానువాదం.) - -

- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

# ఘనంగా కోటసంతానమ్మ జాతర మహోత్సవాలు

## అమ్మవారికి సారి అప్పగింత



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):-** నియోజకవర్గం లోనీ నాతవరం మండలం మర్రిపాలెం గ్రామపంచాయతీ సిద్ది పట్నం గ్రామంలో ఉన్న శ్రీ శ్రీ కోటసంతానమ్మ తల్లి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం అమ్మవారి జాతర కోలాటాలు భజనలు వసంతోత్సవాలు బానసంచ గరగలు సంబరం నిర్వహించడం జరిగింది.

మంగళవారం పండుగ సందర్భంగా అమ్మవారికి తొమ్మిది రకాల పిండివంటలు రకానికి 9 కేజీలు చొప్పున 9 రకాల పుష్పాలతో తొమ్మిది రకాల పళ్ళు తొమ్మిది రకాల చీరలు, తొమ్మిది రకాల గాజులు, జాకెట్లు, అరటికాయలు తొమ్మిది కేజీల పసుపు కుంకుమ 9 కేజీల పసుపుకొమ్ములు అద్దం దువ్వెన కాటుక తిలకం పారాణి నల్లపూసలు మంగళ సూత్రాలు డబ్బులు తో భక్తులు జయ జాన నినాదాలు మధ్య ఊరేగింపు ప్రధానాలయం నుండి బయలుదేరి చెరువుగట్టు వారితో కొలువుతున్న శ్రీ శ్రీ కోటసంతానమ్మ తల్లి ఆలయం వద్దకు చేరి అమ్మవారికి సార్ అని సమర్పించడం జరిగింది అనంతరం ప్రధాన దేవాలయానికి సారి చేరుకుంది సార్లు ఇచ్చే కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు జాకెట్లు గాజులు, కుంకుమరిని పువ్వులు ఇవ్వబడ్డాయి మధ్యాహ్నం భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది భక్తులు పౌర ప్రజలు సహాయ సహకారాలు అందించి అమ్మవారి కృపకుపాతులయ్యారని ఆలయ ప్రధాన పూజారి కెవివి సత్యనారాయణ శర్మ తెలియజేశారు.

# డాక్టర్ డి డి నాయుడుకు సత్కారం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ డి డి నాయుడు ను భారత్ వికాస్ పరిషత్ అనకాపల్లి బ్రాంచ్ వారు స్థానిక శ్రీ ఉప్పలపాటి చంద్రశేఖర్ కళ్యాణమండపంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. రమేష్ చంద్ జైన్ డాక్టర్ డి డి నాయుడును సత్కరించారు. కార్యక్రమంలో భారత వికాస్ పరిషత్ సభ్యులు వంకాయల సన్యాసి రాజు ,డాక్టర్ ఎస్ నూకరాజు ,ఎస్ఐ గోపాల్ రావు , ఎన్ఏబీ వర్మ , దాడి శివరామ , పిల్లా నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అన్నమయ్య 617 వ జయంతి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** పద కవిత పితా మహుడు వాగ్గేయ కారులు అయిన శ్రీ తాళ్ళ పాక అన్నమాచార్యులు వారి 617 జయంతి సందర్భంగా స్థానిక దేవునికి గుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ అన్నమాచార్య వాగ్గేయ వరదాయని వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి నేతృత్వంలో మంగళవారం అన్నమయ్య జయంతి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఉదయం అన్నమాచార్యుల వారి విగ్రహానికి పట్టు వస్త్రాలు అలంకరించి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు . అనంతరం వాగ్గేయ వరదాయని బృందం సభ్యులు అన్నమాచార్యుని కీర్తనలను శ్రవణానందంగా ఆలపించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేసిన సభాపతి అయ్యన్న



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):-** నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం నాడు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలకు సీఎం సహాయనిధి గొప్ప భరోసాగా నిలుస్తోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నర్సీపట్నం మండలం అమలాపురం గ్రామానికి చెందిన శెట్టి స్వామినాయుడు గారికి రూ.56,043/- విలువైన చెక్కును స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి అనేక పేద కుటుంబాలకు ఆపద సమయంలో ఆశ్రయంగా మారిందన్నారు. గత పది నెలల్లో నియోజకవర్గం లోని 25 మందికి పైగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మండల అధ్యక్షుడు శ్రీ రంగంస్వామి, ఇతరలు పాల్గొన్నారు.

# జగన్న కాలనీ భూముల కొనుగోలు వ్యవహారంపై విచారణ జరపాలి

## ఆర్డీవో కార్యాలయంలో టిడిపి మున్సిపల్ కౌన్సిలర్ల ఫిర్యాదు



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వం కాలంలో జగన్న కాలనీ ఇంటి స్థలాల కోసం సేకరించిన భూముల కొనుగోలు ప్రక్రియపై విచారణ జరిపించాలని టిడిపి మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు మాట్లాడుతూ, అప్పటి ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ తన అనుచరుల ద్వారా నాలుగు మండలాల్లో రైతుల నుండి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి, ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయించి లక్షల రూపాయలు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. అటు ప్రభుత్వాన్ని మోసం చేయడమే కాకుండా రైతులను కూడా మోసం చేశారని దీనిపై ప్రభుత్వం వెంటనే సిఐడి తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇంకా, జగనన్న ఇంటి స్థలాల కోసం భూములు ఇచ్చిన రైతులు ఉన్నట్లయితే, వారు ఆయా మండల రెవెన్యూ కార్యాలయాల్లో లేదా స్థానిక ఎమ్మెల్యే, గౌరవ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కు గానీ సమాచారం అందిస్తే, న్యాయం జరగే వరకూ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ డబ్బీరు శ్రీకాంత్, నాయకులు రుత్తల కృష్ణ, పైల గోవిందు, పెదిరెడ్ల చింటూ తదితరులు పాల్గొన్నారు.

# రెండు లారీలు "ఢీ"



**ఆరికరేవుల , (విశాఖ సమాచారమ్ ప్రతినిధి కొల్లి చిన్నబాబు ):** కొవ్వూరు మండలం ఆరికరేవుల గ్రామంలో ఒక పెట్రోల్ ట్యాంకర్ , ఇసుక ట్రిప్పర్ లారీ రెండు ఢీ కొట్టుకున్నాయి.

ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది .ఏటుగట్టు వెంబడి ప్రయాణించే వాహనాలు చాలా జాగ్రత్తగా నెమ్మదిగా వెళ్లాలని అధికారులు పలుమార్లు హెచ్చరిస్తున్నప్పటికీ డ్రైవర్ల నిర్లక్ష్యం వలన ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు .

# అమ్మవారి జాతర విజయవంతం - అందరికీ ధన్యవాదాలు

## ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ అభిషేక్



**జి.మాడుగుల.పాడేరు, (విశాఖ సమాచారమ్):-** గత మూడు రోజులుగా పాడేరులో నిర్వహిస్తున్న శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర విజయవంతమైందని అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ తెలిపారు. మంగళవారం సాయంత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని ప్రభుత్వ వేదికపై మాట్లాడుతూ అమ్మవారి జాతర విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించారని, ముఖ్యంగా స్థానిక శాసనసభ్యులు మత్సరాస విశ్వేశ్వర రాజు ఆలయ కమిటీ చైర్మన్గా కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు సమన్వయ సహకారాలు అందించి ఉత్సవం విజయవంతం కావడానికి సహకరించారని పేర్కొన్నారు. అదేవిధంగా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర రక్షణతో ఎస్పి అమిత్ బర్ద్ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం కృషి చేసిందని, ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ చేపడుతూ జిల్లా పంచాయతీ అధికారులు సేవలందించారని, ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో త్రాగునీటి సరఫరా, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు ఆహార సరఫరా, ఎప్పటికప్పుడు విస్తృత ప్రచారం చేస్తూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తూ నిరంతరం కృషి చేసిన మీడియా మిత్రులకు ఇన్చార్జి కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులకు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులకు పాల్గొన్న కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వి అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్ రజని, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరరావు, ఏవో హేమలత, తదితరులు పాల్గొన్నారు.

# క్వారీ గోతుల పూడ్చివేతకు చర్యలు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం),: రాజమహేంద్రవరంలో ప్రాణాంతకంగా మారిన క్వారీ ప్రాంతం(రామదాసుపేట, సుబ్బారావునగర్)లలో మెటల్ తవ్వకాల వల్ల ఏర్పడిన గోతులను పూడ్చే విషయమై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో నగరపాలక సంస్థ, గనులు, ర.భ.శాఖ అధికారులతో కలెక్టర్ మంగళవారం సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించని లీజుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. క్వారీ లీజులు పొందిన 51 సంస్థలు మెటల్ తవ్విన అనంతరం గోతులను మట్టితో పూడ్చాలనే నిబంధనలను పాటించలేదన్నారు. ఇక్కడ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెండున్నర కిలోమీటర్ల మేర రహదారి నిర్మించి, కంచె ఏర్పాటు చేయడంతో పాటు దీపాలు, సైన్ బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్ లిస్టులో పెట్టిన లీజుదారుల వివరాలను అన్ని శాఖలకు పంపాలని ఆదేశించారు.

**22ఏ భూములపై చర్చ**

నగరంలోని 22ఏ కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. రాజేంద్రనగర్, సుబ్బారావుపేట, నెహ్రూనగర్, బర్మాకాలనీ, బత్తిన నగర్, రామదాసుపేట, ఆనంద్నగర్లలో 22ఏ జాబితాలో ఉన్న భూముల వివరాలను తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్గర్గ్, గనులశాఖ సహాయ సంచాలకుడు ఫణిభూషణ్రెడ్డి, నగర ప్రణాళిక అధికారి కోటయ్య, ఎస్ఈ కోటేశ్వరరావు, ర.భ.శాఖ ఎస్ఈ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మోదకొండమ్మ తల్లి గిరిజన జాతర సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోమంగళవారం నాడు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించా రు.రాష్ట్ర మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు శ్రీ బో ర్ర నాగరాజు సహకారంతో కిండంగి తోట చెక్ పోస్ట్ దగ్గర సుమారు 1000 మందికి పైగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీ ఏ.ఎస్ దినేష్ కుమార్ గారు చైర్మన్ డాక్టర్ అభిషేక్ గౌడ్ గారు ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాలు మాత్రమే కాకుండా అనేకమైన సేవా కార్యక్రమంలో చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగా విద్య, వైద్య మరియు బాధితులు అవసరమైనటువంటి రిలీఫ్ మెటీరియల్స్ అందించడంతోపాటు ఏజెన్సీ ప్రాంతంలో అనేకమైన సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ, జిల్లాలో జూనియర్ అండ్ సీనియర్ రెడ్ క్రాస్ వాలంటీర్స్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం కూడా పెద్ద ఎత్తున చేస్తున్నామని స్టేట్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు బొర్రా నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగరాజు గారు, ఐ ఆర్ సి ఎస్ సెక్రటరీ జి గౌరీ శంకర్ రావు కోశాధికారి పి సూర్యరావు సభ్యులు రవి గారు శ్రీను సంజీవరావు లైఫ్ నెంబరు ఎస్ మణి మరియు జిల్లా కోఆర్డినేటర్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

# రైలు నుంచి జారిపడి మహిళ మృతి



**రాజానగరం/ఏలూరు:** తల్లి దండ్రులతో కలిసి చెల్లిని చూసేందుకు రైలులో హైదరాబాద్ వెళ్తూ ప్రమాదవశాత్తు జారిపడి ఓ వివాహిత మృతిచెందారు. ఈ ఘటన ఏలూరు సమీపంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ఏలూరు పోలీసుల వివరాల ప్రకారం.. రాజానగరం మండలం కలవచర్ల గ్రామానికి చెందిన బొమ్మోతు ఏసు, భార్య కుమారి(40)కి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కాగా కుమార్తెకు వివాహమైంది. సోమవారం అదే మండలం ముక్కినాడలోని కుమారి పుట్టింటికి వెళ్లింది. ఆమె తల్లిదండ్రులు మండేలు సత్యనారాయణ, పాప సోమవారం రాత్రి గౌతమీ ఎక్స్ప్రెస్లో హైదరాబాద్ చిన్నకూతురిని చూసేందుకు వెళ్తుండగా వారి వెంట కుమారి కూడా బయలుదేరింది. ఏలూరు సత్రంపాడు సమీపంలో ఆమె రైలు నుంచి పడి పోయింది. తీవ్ర గాయాల పాలైన ఆమెను స్థానికులు 108 వాహనంలో సర్వజన ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. రైల్వే ఎస్సై సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అయిపోయిన పెళ్లిళ్లకు శుభలేఖలు



ఎలమంచిలి, : ఏదైనా శుభకార్యం కోసం ఆహ్వాన పత్రిక చేయిద్దామని జిల్లాలో ఏ ప్రింటింగ్ ప్రెస్కైనా వెళ్లండి.. అన్నిచోట్లా మూడు, నాలుగు రోజులు పడుతుందనే సమాధానమే వస్తుంది. ఇన్ని పెళ్లిళ్లు ఎక్కడ జరుగుతున్నాయా అని అనుమానం రాకపోదు. కానీ ఇప్పుడు ప్రింట్ అవుతున్న ఆహ్వాన పత్రికలన్నీ ఐదు, పదేళ్ల క్రితం జరిగిన పెళ్లిళ్లకు సంబంధించినవే.

ఒక్క ప్రింటింగ్ ప్రెస్లే కాదు.. జిల్లాలోని రిజిస్ట్రార్ కార్యాలయాలు కూడా అసలు ఖాళీ లేవు. విపరీతంగా వస్తున్న జనాలతో కిటకిటలాడుతున్నాయి. ఈ రెండుచోట్లా ఒక్కసారిగా రద్దీ పెరగడానికి ఒక్కటే కారణం. కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం అవకాశం కల్పించడం.

తల్లిదండ్రుల కార్డుల్లో పేర్లున్న వారికి వివాహాలైనా వారు కొత్తగా రేషన్ కార్డులు తీసుకోవడానికి ఇంతకాలం అవకాశం లేకుండా పోయింది. ఇలాంటి వారికి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పౌరసరఫరాల శాఖకు సంబంధించి కొత్త రేషన్కార్డుల జారీ, కుటుంబ సభ్యుల్లో మార్పుచేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి కొత్తగా రేషన్ కార్డు కావాలనుకునే వారు ఆధార్తోపాటు వారి వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం జత చేసి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. దీంతో ఒక్కసారిగా వివాహ రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారితో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి.

వివాహ రిజిస్ట్రేషన్ కావాలంటే రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ. 500 ఫీజుగా చెల్లించాలి. ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలి. వయసు ధ్రువప్రతం, ఆధార్ కార్డు, పెళ్లికార్డు, రెండు ఫోటోలు, ముగ్గురు సాక్షులు ఉండాలి. పెళ్లయి ఐదు, పదేళ్లు అయినవారి వద్ద వివాహ ఆహ్వాన పత్రికలు లేవు. ఈ కారణంగా వీరంతా ఇప్పుడు పాత తేదీలతో కార్డులు ప్రింటింగ్ చేయించుకుంటున్నారు.

జిల్లాలో వివాహ రిజిస్ట్రేషన్లు బాగా పెరిగాయి. రేషన్ కార్డులకు వివాహ ధ్రువపత్రం తప్పనిసరి కావడంతో చాలామంది ఇందుకోసం వస్తున్నారు. వీటి రద్దీ బాగా పెరిగింది. రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరుగుతోంది తప్ప వీటివల్ల ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం రాదు. బుక్ చేసుకునే స్లాట్లు బాగా పెరిగాయి. అన్ని కార్యాలయాల్లోనూ వీటి కారణంగా పని ఒత్తిడి గణనీయంగా పెరిగింది.

# 109 ఏళ్ల వృద్ధురాలి మృతి



**గోకవరం:** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు అల్లిమిల్లి చంటమ్మ(109) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. మనవలు, మునిమనవలు, వారి పిల్లలతో కలిసి మొత్తం 90 మంది కుటుంబసభ్యులు ఉన్నారు. భర్తతో సహా సంతానానికి పాండవుల పేర్లు ఉండడం గమనార్హం. చంటమ్మ భర్త పాండవులు కాగా ఇరవయ్యేళ్ల క్రితం ఆయన చనిపోయారు. వారి నలుగురు కుమారులకు వరుసగా ధర్మరాజు, భీమరాజు, అర్జునుడు, నకులుడు అని పేర్లు పెట్టుకున్నారు. చంటమ్మకు ఏవిధమైన అనారోగ్య సమస్యలు లేవని, చివరి రోజు వరకు ఆరోగ్యంగా ఆమె జీవించారని కుటుంబసభ్యులు తెలిపారు.

# ఉగ్రదాడులు, విపత్తులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

- డి.ఆర్.ఓ.,వై.సత్యన్నారాయణ రావు
- గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ లో ప్రభుత్వ శాఖల మాక్ డ్రిల్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ఉగ్రదాడులు, విపత్తులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యన్నారాయణ రావు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం అనకాపల్లి పట్టణం బైపాస్ రోడ్డు లోని జయభేరి మారుతి షోరూం ఎదురుగా ఉన్న గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ లో శేషాద్రి బ్లాక్ వద్ద జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్ ఆసాంతం ఆశక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా పాత్రికేయులతో డి.ఆర్.ఓ. మాట్లాడుతూ గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ లో శేషాద్రి బ్లాక్ లో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు.

జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన (ఎస్ఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్) దళాలు మరియు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖలు, జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన (ఎస్ఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్) దళాలు విన్యాసాల్లో భాగస్వామ్యం అయ్యయ్యాన్నారు. అపార్ట్మెంట్లో సుమారుగా 400 నుంచి 500 దాకా జనాభా ఉంటారని ఇలాంటి అపార్ట్మెంట్ లలో ఎక్కువగా మానవ నష్టాలు ఉండే అవకాశాలుంటా యని, అప్పుడు బాంబు పేలితే, ఆ భవనం కూలిపోతే ఏం చేయాలి, సైరన్ మోగినప్పటి నుంచి చివరికి వారు రెస్క్యూ చేసి హాస్పిటల్ కి చేర్చేదాకా వివిధ రకాల డ్రిల్స్ ని మొదట అధికారులు చూపించడం జరిగిందన్నారు. వినూత్నమైన పరికరాల గురించి వివరించడం జరిగిందని పేర్కొన్నారు. విపత్తుల యాజమాన్య సంస్థ సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులను నిర్వహిస్తారని అన్నారు. అన్ని శాఖాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తినష్టం జరగకుండా చూడాలని అన్నారు. అధికారులు కూడా డ్రిల్ గురించి నేర్చుకున్నారన్నారు. తరువాత ఇక్కడున్న పౌరులచేత రెస్క్యూ చేయించడం జరిగిందని తెలిపారు. మాక్ డ్రిల్ పట్ల పిల్లలు, మహిళలకు, యువకులకి ఎక్కువగా అవగాహన రావాలన్నారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో సీజ్ ఫైర్ ఉన్నా సరే ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం యంత్రాంగం వచ్చినప్పుడు వారికి ఎలా సహకరించాలి అనేది తెలుసుకోవాలన్నారు. అంతకుముందు అకస్మాత్తుగా ఏదైనా విపత్తు సంభవిస్తే, విపత్కర, సంక్షోభ పరిస్థితులు ఎదురైతే, యుద్ధం వల్ల బాంబులు పడి లేదా గ్యాస్ లీక్, షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే, అలాంటి సమయంలో ప్రభుత్వం ఏవిధమైన సహాయ చర్యలు తీసుకుంటుంది, వివిధ ప్రభుత్వ శాఖలు ఎటువంటి చర్యలు చేపడతాయి.. ఆయా శాఖల సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను ఏవిధంగా కాపాడతారు అన్న అంశాలను కళ్లకు కట్టినట్టు చేసి చూపించారు. బాంబులు, ఇతర ప్రేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే విధానాన్ని కూడా వివరించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖ, ఎస్డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్, తదితర శాఖలు ఈ విన్యాసాల్లో భాగస్వాములు అయ్యాయి. పై అంతస్థులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడం, క్షతగాత్రులను అక్కడినుంచి క్రిందకి దించడం, వారికి వైద్య సహాయాన్ని అందించడం, హుటాహుటిన అంబులెన్సు ద్వారా ఆసుపత్రికి తరలించడం, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయ పడటం, అప్పటికీ పరిస్థితి అదుపులోనికి రాని పక్షంలో ఎన్డిఆర్ఎఫ్ దళాలు జత కలవడం, ప్రజల ప్రాణాలను రక్షించి, సహాయ చర్యలు చేపట్టడం తదితర అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. ప్రకృతి వైపరీత్యాలతోపాటు, మానవ ప్రేరేపిత ప్రమాదాలను సైతం ఎదుర్కొనే విధానాన్ని వివరించి, అధికారులు తమ సన్నద్ధతను తెలియజేశారు.మాక్ డ్రిల్ కార్యక్రమంలో అనకాపల్లి ఇంచార్జి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతి ప్రభ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్ వెంకటరమణ, ఎన్.డి.ఆర్.ఎఫ్. ఇన్స్పెక్టర్ సుశాంత్ కుమార్, అగ్ని మపక, రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్. ఎఫ్ దళాలు, గ్రీన్ హిల్స్ గ్రేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ పౌరులు, తదితరులు భాగస్వామ్య మయ్యారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

ప్రకటన నం. eT-East-WAT-14-2025 తేది.06.05.2025

**పని పేరు:** వాల్తేరు డివిజన్ యొక్క సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (ఈస్ట్)/, వాల్తేరు అధికార పరిధి క్రింద NG లైన్ పై మెయిన్ లైన్ & నౌపాడ -గుణుపూర్పై దోంకినవలస - విజయనగరం - పలాస మధ్యన ఐదు సంవత్సరాల కాలానికి దాని నిర్వహణ కలుపుకొని కాంట్రాక్టర్ల స్వంత హైడ్రాలిక్ టైప్ గేజ్ ఫేస్ లూబ్రికేటర్ ద్వారా కర్వుల యొక్క లూబ్రికేషన్

**పని సుమారు వ్యయం :** రూ.9,76,04,673.60, బయానా: రూ. 6,38,000, పని పూర్తి చేయు కాలం: 60 (అరవై) నెలలు,

**టెండరు ముగింపు తేది మరియు సమయం:** 03.06.2025న 1500 గం.కు.

సంస్థ లెటర్ హెడ్పై దాఖలు చేయబడినప్పటికీ, సకాలంలో అందినప్పటికీ కూడా సదరు టెండర్లపై తపాలా/కొరియర్/ఫ్యాక్స్ లేదా స్వయంగా ఎటువంటి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించబడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు చెల్లనివిగా పరిగణించబడును మరియు ఎటువంటి పరిశీలన లేకుండా తిరస్కరించబడును. పై ఇ-టెండరు యొక్క ఇ-టెండరు డాక్యుమెంట్లు కలుపుకుని పూర్తి సమాచారం వెబ్సైట్ www.ireps.gov.in లో లభిస్తుంది.

గమనిక: కాగోరు టెండరుదారులు ఈ టెండరు కొరకు జారీ చేయబడినట్టి ఏవేని సవరణలు/మార్పులు గమనించుటకు టెండరు ముగింపు తేదీనకు ముందు 15 (పదిహేను) రోజులు వెబ్సైట్ను తిరిగి దర్శించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (Engg.)/ వాల్తేరు

PR-123/Q/25-26

# ఉష్ణ తాపాన్ని తగ్గించడమే లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర దినోత్సవ కార్యక్రమాలు

**విజయనగరం:** రాష్ట్ర ప్రభుత్వం "స్వచ్ఛాంధ్రప్రదేశ్" కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలు మరియు విభాగాలలో అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుత వేసవి పరిస్థితుల దృష్ట్యా, ప్రజారోగ్యం, పర్యావరణ సుస్థిరత, సంఘం మరియు వాతావరణ స్థితిస్థాపకతను ఈ నెల 17వ తేదీ స్వచ్ఛాంధ్ర దినోత్సవం నుంచి విభిన్న కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఈ నెల థీమ్ "బీట్ ది హీట్ గా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో, స్వచ్ఛాంధ్ర దినోత్సవాన్ని 17వ మే 2025 (మూడవ శనివారం) నాడు నిర్వహించడమే కాకుండా, వేడి ప్రభావాన్ని తగ్గించడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి, ప్రజల్లో అవగాహనను పెంచడానికి అనుగుణంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను రూపొందించింది.

**ప్రభుత్వం సూచించిన కార్యకలాపాలు:**

ట్రాఫిక్ కూడళ్లలో, మార్కెట్లలో, బస్ స్టాప్‌లలో, మతపరమైన ప్రదేశాలలో మరియు ఇతర ప్రజల సమావేశ స్థలాలలో నీడను ఏర్పాటు చేయాలి.

భవనాలపై మరియు ఇతర ప్రజా కాంక్రీట్ నిర్మాణాల పైకప్పుపై తోటపని మరియు మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా వేడిని తగ్గించాలి మరియు తేమను పెంచాలి.

తక్కువ ఖర్చుతో కూడిన రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్‌ను ప్రభుత్వ కార్యాలయాలు, తక్కువ ఆదాయం ఉన్న గృహాల పైకప్పులపై వేడిని తగ్గించడానికి ఉపయోగించాలి.

కీలకమైన ప్రదేశాలలో అంటే ప్రభుత్వ కార్యాలయాలు, బస్ స్టాప్‌లు మరియు జనసమ్మర్ధ ప్రాంతాల్లో ప్రజల కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి.

పాఠశాలలు, కళాశాలలు మరియు ఇతర ప్రభుత్వ భవనాలలో వర్షపు నీటిని నిల్వ చేసే నిర్మాణాలను ప్రోత్సహించాలి.

రోడ్ల వెంట, పాఠశాలల ప్రాంగణాలలో, పార్కులలో మరియు బహిరంగ ప్రదేశాలలో పెద్ద సంఖ్యలో నీడనిచ్చే చెట్లను నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంచాలి.

సీనియర్ సిటిజన్లు, పిల్లలు మరియు ఎండలో పనిచేసే కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలి. వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి.

పశువులు మరియు వీధి కుక్కల కోసం నీటి తొట్టెలు మరియు మట్టి కుండలను ఫంక్షనల్ పార్కులు, దేవాలయాల పరిసరాలు ఇతర అనువైన ప్రదేశాలలో ఏర్పాటు చేయాలి.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ జారీ చేసే హీట్ అలర్ట్, వాతావరణ హెచ్చరికలు, వడదెబ్బ నివారణ చిట్కాలు మరియు సహాయక చర్యలపై మొబైల్ ప్రకటనలను ప్రోత్సహించాలి.

వేడిమి నివారణ, పారిశుధ్యం మరియు ప్రజా సంక్షేమంలో పాల్గొంటున్న ఫ్రంట్‌లైన్ వర్కర్లు, స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థలను గుర్తించి వారికి అవార్డులు ఇవ్వాలి.

పునరుత్పాదక శక్తి, వ్యర్థ పదార్థాల నిర్వహణ మరియు వాతావరణ మార్పుల తగ్గింపుపై అవగాహన పెంచాలి.



ప్రభుత్వ భవనాలు మరియు బలహీన వర్గాల నివాసాలలో ఎకో-కూల్ రూఫ్ టెక్నాలజీల వినియోగాన్ని ప్రోత్సహించాలి.

వేసవిలో సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌లను నిషేధించాలి. ప్రజల, సంస్థాగత కార్యక్రమాలలో తిరిగి ఉపయోగించగల సీసాల వినియోగాన్నిప్రోత్సహించాలి.

పాఠశాల పిల్లలలో "బీట్ ది హీట్" అనే అంశంపై డ్రాయింగ్, పోస్టర్-మేకింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించాలి.

ఇంటి వద్ద మరియు కుటుంబ స్థాయిలో నీటి సంరక్షణ అవగాహన ప్రచారాలను నిర్వహించాలి.

స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, ఆటోలు మరియు వాట్సాప్ గ్రూపుల ద్వారా రేడియో జింగిల్స్, ఆడియో సందేశాలు మరియు అవగాహన పోస్టర్‌లను రూపొందించాలి.

గ్రామీణ మరియు సెమీ-అర్బన్ ప్రాంతాలలో పశువుల కోసం నీడ ఉన్న ప్రదేశాలను ఏర్పాటు చేయాలి. వాటి ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి వెటర్నరీ టీమ్‌లను నియమించాలి.

దీనికి అదనంగా, జిల్లా యంత్రాంగం అక్కడి స్థానిక అవసరాలకు అనుగుణంగా ఇతర కార్యకలాపాలను చేపట్టవచ్చు.

ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక బృందాలు మరియు పరిశ్రమలను భాగస్వామ్యం చేసుకొని విజయవంతం చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. వీటికి కేవలం ఒక్కరోజుకే పరిమితం చేయకుండా, స్వచ్ఛాంధ్ర దినోత్సవం ఈ మే 17 నుండి నెల పొడవునా కార్యక్రమాలను నిర్వహించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి. అనిల్ కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లాలో కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు.

# రాష్ట్రంలోనే అల్లూరి స్మారక మందిరానికి గుర్తింపు

ఇద్దరు ఎంపీల నిధుల నుంచి రూ. 20 లక్షల కేటాయింపు : సభాపతి అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్రంలోనే అల్లూరి స్మారక మందిరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్న లక్ష్యంతో అవసరమైన చర్యలు చేపట్టినట్టు స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. గొలుగొండ మండలం, కృష్ణదేవిపేటలో ఉన్న అల్లూరి స్మారక మందిర అభివృద్ధిపై బుధవారం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో పార్క్ ఆవరణలో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం పార్కు ను సందర్శించి లోటుపాట్లు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో మేరీ విజయకుమారి ఎంపీగా ఉన్న సమయంలో ఈ మందిరాన్ని కొంతమేర అభివృద్ధి చేశారని తెలిపారు. అనంతరం టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ కొంతమేర నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన అనంతరం పర్యాటక శాఖామంత్రితో చర్చించి, అల్లూరి పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్టు స్పీకర్ చెప్పారు.సోలార్ లైట్లతో పాటు, డైనింగ్ హాలు, టాయిలెట్లు వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. పర్యాటకులు, విద్యార్థుల కోసం అల్లూరి చరిత్ర బయోగ్రఫీ వీడియోలను అందుబాటులో ఉంచి, పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా సందర్శన ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.పర్యాటక శాఖ ఆర్థిక సహాయంతో పాటు ఎంపీలకు కేంద్రం మంజూరు చేసిన నిధులను కూడా ఈ అభివృద్ధి పనులకు వినియోగించేందుకు తాను ప్రయత్నించానని తెలిపారు. ఇందులో భాగంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్ రావు చెరో రూ. 10 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్టు ప్రకటించారు. మిగిలిన ఎంపీలు కూడా నిధులు కేటాయించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిధులతో ప్రాధాన్యతా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జనసేన నర్సీపట్నం నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ రాజాన వీర సూర్యచంద్ర పర్యాటక శాఖ అధికారులు ఈ.ఈ.కే. విజయభాస్కర్ రెడ్డి, డి.ఈ.ఎస్.జి. సత్యనారాయణ, పి. సీతారాం, టూరిజం మేనేజర్ సూరెడ్డి అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు అడిగర్ల నానిబాబు, మాజీ జెడ్పిటిసి వేణుగోపాల్, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఆంజనేయస్వామి మాలలు



**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఘనంగా ఆంజనేయ స్వామి మాలలు రావికమతం మండలం మత్స్యవాన్నిపాలెం గ్రామంలో ఈరోజు సుమారు 20 మంది హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఆంజనేయ స్వామి మాలలు వేసుకోవడం జరిగింది తొమ్మిది రోజులు పాటు స్వామివారి కఠిన దీక్షలు తీసుకుంటూ హిందూ సాంప్రదాయాలు పాటించుకుంటూ ఈరోజు గ్రామ పురోహితులు వేప ధర్మ పణి ఈశ్వరి ఆధ్వర్యంలో 20 మంది భక్తులు మాలధారణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మలి చెట్ల గణేష్, పాల్గొన్నారు. గురు స్వామి సోమిరెడ్డి శివ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి మారాధారణ జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నలు పెద్దలు గ్రామ నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లోని గ్రామ పురోహితులు వేప ధర్మ ఫణి శర్మ ఈశ్వరి పాల్గొన్నారు గ్రామానికి మంచి జరగాలని ఆకాంక్షించారు.

## కలబంద , కొబ్బరిలతో వేడి తేమ ప్రభావం నుండి జుట్టుకు రక్షణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** వేసవి నెలలు సమీపిస్తున్నట్లు, వేడి మరియు తేమ జుట్టుకు ఎక్కువ నష్టం కలిగించగలవు. ఈ కాలంలో, జుట్టు పొడిగా మారడం మరియు విరిగిపోవడం వంటి సమస్యలు సాధారణంగా ఎదురయ్యే సమస్యలుగా మారిపోతాయి, ఫలితంగా జుట్టు ఆరోగ్యంగా కాకుండా మసకబారినట్లు కనిపిస్తుంది.

వేడి మరియు తేమ జుట్టుకు కలిగించే హానిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. సూర్యకిరణాలు మరియు అధిక ఉష్ణోగ్రతలు జుట్టు సహజ ఆర్ద్రతను హరించడంతో, పొడితనం, నాజుకత్వం మరియు విరిగిపోవడం వంటి సమస్యలు ఏర్పడతాయి. అందుకే, వేసవి సమయంలో జుట్టులో తేమను నిలుపుకోవడం అత్యంత అవసరమవుతుంది.

డాక్టర్ శిల్పా వోరా, చీఫ్ ఆర్ & డి ఆఫీసర్, మారికో ఇలా అన్నారు, జుట్టు సంరక్షణలో ప్రఖ్యాత నిపుణురాలు, వేడి మరియు తేమ యొక్క కఠిన ప్రభావాల నుండి జుట్టును రక్షించుకోవడంలో రెండు కీలక పదార్థాలను ఉపయోగించే పద్ధతిని పంచుకుంటున్నారు: కలబంద మరియు కొబ్బరి. ఈ పరిపూర్ణ పరిష్కారం మరియు తేమను లాక్ చేయడం ద్వారా మీ జుట్టును తీవ్రంగా పోషించే ప్రత్యేకమైన కలయిక

కలబంద, దాని హైడ్రేటింగ్ మరియు సూథింగ్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది, ప్రత్యేకంగా వేసవిలో ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. కలబందతో సమృద్ధిగా ఉన్న ఈ నూనె, జుట్టు నుండి తేమ నష్టాన్ని నివారించడంలో/ జుట్టులో తేమను లాక్ చేయడంలో సహాయపడుతుంది, తద్వారా జుట్టు గమనించదగ్గ విధంగా మృదువుగా, సున్నితంగా మరియు నిర్వహించడానికి సులభతరం అవుతుంది. డాక్టర్ వోరా ఇలా తెలిపారు, "మీ జుట్టు మృదువుగా, హైడ్రేటెడ్/పోషితంగా ఉండేలా వేసవి అంతా మీ జుట్టును 2 రెట్లు మృదువుగా మరియు సాఫీగా చేస్తుంది. తేలికపాటి షాంపూతో కడగడానికి ముందు జుట్టు కోసం నూనెను సుమారు 30 నిమిషాలు పని చేయనివ్వండి.వారానికి రెండు నుండి మూడు సార్లు ఇలా చేయడం వల్ల తేమను నిలుపుకోవటానికి, చుండ్రును నియంత్రించడానికి మరియు జుట్టును మృదువుగా మరియు పోషణగా ఉంచడానికి సహాయపడుతుంది."

## సిపెట్ డిప్లొమా కోర్సులకై దరఖాస్తుల ఆహ్వానం

సిపెట్ డైరెక్టర్ డా. సిహెచ్. శేఖర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** "సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ విజయవాడలో 10వ తరగతి విద్యార్హతతో 3 సం.ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, బి.యస్సీ విద్యార్హతతో 2 సం.లు వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ అనే 3 కోర్సులకై రాష్ట్రవ్యాప్తంగా ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ డా. సిహెచ్. శేఖర్ తెలిపారు. ధరఖాస్తులను ఆన్లైన్ విధానంలో https://cipet25.onlineregistrationform.org/CIPET అనే లింకు ద్వారా మే 29, 2025 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కోర్సులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి "ఫీజు రీయింబర్స్మెంట్" సదుపాయం ఉందని, సీపెట్ అడ్మిషన్ టెస్ట్ను జూన్ 8, 2025 నాడు నిర్వహించి అందులో వచ్చిన ర్యాంక్ ఆధారంగా విజయవాడ కేంద్రంలో గల 150 సీట్లను భర్తీ చేస్తారని తెలిపారు. ఈ కోర్సులను పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్స్ రంగంలో గల బహుళ జాతి సంస్థ & అనుబంధ సంస్థలలో జూనియర్ ఇంజనీర్ (ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్ & మేకర్, జూనియర్. ఇంజనీర్ (మైంటెనెన్స్), క్వాలిటీ కంట్రోల్ విభాగాలలో ఇన్స్పెక్టర్ వంటి ఉద్యోగ అవకాశాలు కలవని, ప్రారంభ వేతన స్థాయి నెలకు రూ. 20,000/- నుంచి రూ. 25,000/- వరకూ ఉంటుందని, సగటు (సాధారణ) విద్యార్థులకు కూడా మెరుగైన విజయాన్ని అందిస్తాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు, ఇతర వివరాలకై 7893586494 నెంబర్లో నేరుగా సంప్రదించాలని సూచించారు.

# వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలి

ఇంచార్జి జిల్లా కలెక్టరు ఎమ్. జాహ్నవి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** జిల్లాలో ఏర్పాటుచేసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని జాయింటు కలెక్టరు మరియు ఇంచార్జి జిల్లా కలెక్టరు ఎమ్. జాహ్నవి తెలిపారు. బుధవారం జాయింటు కలెక్టరు కార్యాలయంలో వేసవి క్రీడా శిబిరాల క్రీడాకారులకు క్రీడా పరికరాలు పంపిణీ చేసారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 50 వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. విద్యార్థులందరూ క్రీడా శిబిరాలను వినియోగించుకొని ఆటలలో బాగా రాణించాలని, భవిష్యత్తులో పతకాలు సాధించాలని తెలిపారు. ఆటల వలన విద్యార్థుల మనోవికాశం పెరుగుతుందని, ఆరోగ్యం బాగుంటుందని, చదువులో రాణిస్తారని కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి క్రీడా శిబిరానికి అయిదువేల రూపాయలు విలువచేసే క్రీడా పరికరాలను పంపిణీచేయడం జరిగిందని తెలిపారు. క్రీడా పరికరాల నాణ్యతగూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు.జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎల్.వి. రమణ క్రీడా శిక్షణా శిబిరాల వివరాలు తెలియజేస్తూ జిల్లాలో ఏర్పాటుచేసిన 50 శిక్షణా శిబిరాలకు 982 మంది విద్యార్థులు పేర్లు నమాదు చేసుకున్నారని, వారిలో 612 మంది బాలురు, 370 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. వీరికి 20 క్రీడా అంశాలలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. 8 నుండి 14 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులలో ప్రతిభావంతులను గుర్తించి వారిని ప్రోత్సహించడం కోసం ప్రతి సంవత్సరం క్రీడా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.క్రీడా పరికరాల పంపిణీ కార్యక్రమంలో అచ్చుతాపురం, జిల్లాపరిషత్ పాఠశాల క్రీడా శిబిరం, హరిపాలెం రగ్బీ ఆట శిబిరం, అక్కిరెడ్డిపాలెం క్రీడాశిబిరం విద్యార్థులు పాల్గొన్నారు.కో కో ఆటలో జాతీయ స్థాయిలో రజత పతక విజేత శ్యామ్ ప్రసాద్ ను ఇటీవల జరిగిన సివిల్ సర్వీసెస్ ఆటల పోటీలలో వెండి పతకం సాధించినందుకు ఇంచార్జి కలెక్టరు అభినందించారు.ఈ కార్యక్రమంలో కోచ్ లు కె.త్రిమూర్తులు, రెహమాన్, చిరంజీవి, రమేష్ పాల్గొన్నారు.

## హేండ్‌లూమ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలు

**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని వెంకటగిరి శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హేండ్‌లూమ్ టెక్నాలజీ 3 ఏళ్ల డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఓఎస్డి ఎస్.గిరిధరరావు ఒక ప్రకటలో తెలిపారు. ఈ సంస్థలో 53 సీట్లు, తమిళనాడు సేలంలోని 12 సీట్లు, కర్నాటకలోని గడగ్‌లో 4 సీట్లకు ప్రవేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై, వయసు ఈ ఏడాది జులై 1 నాటికి 15 నుంచి 23 సంవత్సరములు మధ్య ఉండాలని, ఎస్‌సి, ఎస్టి విద్యార్థులకు వయసు 25 సంవత్సరాలు వరకు ఉండవచ్చునని సూచించారు. ఇంటర్ ఎంపిసి, ఒకేషనల్(టెక్స్‌టైల్స్), ఐటిఐ రెండు సంవత్సరాల కోర్సు ఉత్తీర్ణులైనవారు ఈ డిప్లమో కోర్సులో నేరుగా రెండవ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. అపేరల్ మరియు గార్మెంట్ మేకింగ్ టెక్నాలజీలో ఉచితంగా శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. దరఖాస్తు, ఇతర వివరాలు తెలుసుకొనేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఐహెచ్‌టివిజిఆర్.కామ్‌కు లేదా ఫోన్ నెంబర్లు 08625-295003, 9399936872, 9866169908, 9010243054కు సంప్రదించవచ్చునని సూచించారు.

## మంత్రి సంధ్యారాణిని కలిసిన ఎంపీపీ మండల పార్టీ నాయకులు




**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండగకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ శిశు మరియు గిజనా సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి జి మాడుగుల ఎంపీపీ లొంబోరి అప్పలరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఆమెకు పుష్ప గుచ్చలు అందజేశారు . జిమ్ మాడుగుల మండలంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఎంపీపీ తెలిపారు. రాష్ట్ర ఎస్ టి సెల్ ఉపాధ్యాయకులు సొమెలి చిట్టిబాబు పాలమామిడి ఎంపీటీసీ గెమ్మెలి అప్పారావు గడుతూరు సర్పంచ్ కొండపల్లి. సింహాచలం టీడీపి సీనియర్ నాయకులు కొండపల్లి. పిన్నయ్య మాజీ ఎంపీటీసీ మాతే అప్పారావు టీడీపి క్లస్టర్ ఇంచార్జి గేదెలి వెంకట్ పాల్గొన్నారు.

2nd pages111.qxd 5/14/2025 8:18 PM Page 8






# ఇక అంతా గంభీర్ చేతుల్లో..!




స్టార్ సంస్కృతికి నెలవైన భారత క్రికెట్లో ఆటగాళ్లను దాటి కోచ్ అందరి దృష్టిలో నిలవడం, ఆధిపత్యం చలాయించడం అరుదు! గతంలో గ్రెగ్ చాపెల్, అనిల్ కుంబ్లే లాంటి ఒకరిద్దరు కోచ్‌లు ఆటగాళ్లను అదుపు చేయాలని ప్రయత్నించి, అది సాధ్యం కాక తమ పదవులకు దూరమయ్యారు! కానీ ఇప్పుడు కొత్త కథ చూడబోతున్నాం. ఎక్కువగా జూనియర్ ఆటగాళ్లతో నిండిన భారత జట్టును కోచ్ గౌతమ్ గంభీర్ శాసించే సంకేతాలు కనిపిస్తున్నాయి. టెస్టు కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీల నిష్క్రమణతో గౌతీ ఇక సర్వాధికారి కాబోతున్నట్లే!

కేవలం అయిదు రోజుల వ్యవధిలో ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు భారత టెస్టు జట్టును వీడారు. ముందుగా కెప్టెన్ రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు టాటా చెప్పేయగా.. తాజాగా కోహ్లి సైతం అతడి బాటలోనే నడిచాడు. దీంతో ఒక్కసారిగా భారత టెస్టు జట్టు కళ తప్పిన భావన కలుగుతోంది అభిమానులకు. రోహిత్, కోహ్లి చరమాంకంలో ఉన్న సంగతి తెలిసిందే కానీ.. ఇప్పుడిలా ఉన్నట్లుండి ఇద్దరూ ఒకేసారి రిటైరైపోతారని అభిమానులు ఊహించి ఉండరు! రోహిత్ నిష్క్రమణతో జట్టుకు కొత్త కెప్టెన్ రాబోతున్నాడు. కుర్రాడైన శుభ్‌మన్ గిల్ పగ్గాలు అందుకోవచ్చని భావిస్తున్నారు. ఇక సచిన్, కోహ్లి లాంటి దిగ్గజ బ్యాటర్లు ఆడిన నాలుగో స్థానాన్ని ఇకపై ఎవరు భర్తీ చేస్తారన్నది ఆసక్తికరం. ఈ సంగతి పక్కన పెడితే.. జట్టులో ఇక మిగిలిన సీనియర్ ఆటగాళ్లంటే రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, జస్‌ప్రీత్ బుమ్రా మాత్రమే. జడేజా కూడా ఇంకెంతో కాలం జట్టులో కొనసాగకపోవచ్చు. బుమ్రా గాయాలతో జట్టులోకి వస్తూ పోతూ ఉన్నాడు. రాహుల్ నిలకడ అందుకుంటే తప్ప స్టార్ ఆటగాడిగా గుర్తింపు రాదు. ఈ నేపథ్యంలో ఎక్కువగా వర్ధమాన ఆటగాళ్లతో కూడిన జట్టుపై కోచ్ గంభీర్‌కు పూర్తిగా పట్టు చిక్కడం ఖాయం. జట్టు సెలక్షన్, మ్యాచ్ ప్రణాళికలు.. ఇలా అన్నింట్లోనూ గౌతీ ముద్ర ఉండబోతోందన్నది స్పష్టం. ప్రస్తుతం జట్టులో అతడి మాటకు ఎదురుండదని చెప్పొచ్చు. ప్రయోగాలు చేయడానికి ఆస్కారముంది. అయితే అనుభవం కొరవడిన ఈ జట్టును నడిపించడం గంభీర్‌కు అంత తేలికేమీ కాదు. రోహిత్, కోహ్లి రిటైరయ్యాక ఆడబోయే తొలి సిరీసే అత్యంత కఠినమైంది. ఇంగ్లాండ్‌లో యువ జట్టుతో నెట్టుకురావడం సవాలే. ఈ సిరీస్‌లో జట్టు విఫలమైతే.. కోచ్‌గా గంభీర్ ఖాతాలో వరుసగా మూడో పరాభవం జమ అవుతుంది. అప్పుడతను తీవ్ర ఒత్తిడిలో పడతాడు. కానీ ఈ జట్టుతో ఇంగ్లాండ్‌లో విజయం సాధిస్తే మాత్రం కోచ్‌కు గొప్ప పేరు వస్తుంది. అప్పుడు భారత క్రికెట్లో నవశకం ఆరంభమైనట్లే. మరి సంధి దశలో ఉన్న జట్టును గంభీర్ ఎలా నడిపిస్తాడో చూడాలి.

# విరాట్, రోహిత్ స్థానాల్లో ఎవరు?




విరాట్ కోహ్లి.. రోహిత్‌శర్మ.. వీరు లేని భారత టెస్టు జట్టును ఊహించలేం. సుదీర్ఘ కాలంగా ఈ ఫార్మాట్లో టీమ్‌ఇండియాకు వెలకట్టలేని సేవలందించింది ఈ దిగ్గజ ద్వయం. గత వారం రోహిత్ టెస్టులకు రిటైర్‌మెంట్ ప్రకటిస్తే.. కోహ్లి ఉన్నాడుగా అని అభిమానులు కాస్త భరోసాతో ఉన్నారు. ఇప్పుడు విరాట్ కూడా తానూ రోహిత్ బాటలోనే అని చెప్పేశాడు. భారత టెస్టు జట్టులో ఇద్దరు స్టార్ ప్లేయర్ల స్థానాలు ఖాళీ అయ్యాయి. మరి ఇప్పుడున్న కుర్రాళ్లలో ఆ స్థానాలను భర్తీ చేయగల సత్తా ఎవరికుంది?

కోహ్లి, రోహిత్ తర్వాత వారి స్థాయిలో రాణించగలిగే సత్తా ఉన్న బ్యాటర్లుగా శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ కనబడుతున్నారు. గిల్‌ను ప్రధాన బ్యాటర్‌గానే కాక.. రాబోయే రోజుల్లో జట్టుకు సారథిగా అతడిని చూసే అవకాశం ఉంది. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ నుంచి అతడు పగ్గాలు అందుకోవడం లాంఛనమే. విరాట్, రోహిత్ మాదిరే నాణ్యమైన బ్యాటింగ్, పటిష్టమైన డిఫెన్స్ ఈ కుర్రాడి సొంతం. కోహ్లిలా ఫిట్‌నెస్‌ను ఎంతో ఇష్టపడతాడతడు. వన్డే, టీ20 ఫార్మాట్లో స్థిరత్వాన్ని చూపించిన ఈ పంజాబ్ కుర్రాడు.. టెస్టుల్లోనూ అందుకోవాల్సిన సమయం వచ్చింది. మరోవైపు ఆడింది తక్కువ మ్యాచ్‌లే అయినా తానేంటో ఇప్పటికే నిరూపించుకున్నాడు ఓపెనర్ యశస్వి జైస్వాల్. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌లో కొత్త బంతిని ఎదుర్కొన్న అనుభవం ఉన్న యశస్వి ముందు ఇంగ్లాండ్ సిరీస్ రూపంలో పెద్ద సవాల్ ఎదురు కానుంది. రోహిత్ రిటైర్ కావడంతో ఇప్పుడు అతడే ఇన్నింగ్స్‌కు రూపం ఇచ్చే బాధ్యతను తీసుకోవాల్సి ఉంటుంది. స్వింగ్‌కు అనుకూలమైన పిచ్‌లపై యశస్వి దూకుడు కొనసాగిస్తాడా అనేది ఆసక్తికరం.

వాళ్లు కూడా..: కోహ్లి, రోహిత్ ఖాళీ చేసిన స్థానాలను సమర్థంగా పూరించగల సత్తా ఉన్న బ్యాటర్ల వరుసలో సాయి సుదర్శన్, సర్ఫరాజ్ ఖాన్, కరుణ్ నాయర్ ఉన్నారు. సెలక్టర్లు కాస్త అనుభవజ్ఞుడైన ఆటగాడిని కోరుకుంటే శ్రేయస్ అయ్యర్ తప్పక జట్టులో ఉంటాడు. పరిమిత ఓవర్ల క్రికెట్లో ఇప్పటికే తానేంటో నిరూపించుకున్న అతడు.. టెస్టుల్లో సత్తా చాటాలని కోరుకుంటున్నాడు. ఇప్పటికే అతడు 14 టెస్టులు ఆడాడు. మరోవైపు టైమింగ్.. బలమైన టెక్నిక్‌తో సుదర్శన్ ఐపీఎల్-18లో గుజరాత్ టైటాన్స్ తరఫున అదిరే ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు సుదర్శన్‌ను ఎంపిక చేయాలని రవిశాస్త్రి లాంటి మాజీ ప్లేయర్లు కూడా సూచిస్తున్నారు. కౌంటీల్లో సర్రే జట్టుకు ఆడిన అనుభవం కూడా సుదర్శన్‌కు ఉంది. దేశవాళీలో వేల కొద్దీ పరుగులు సాధించి భారత జట్టులోకి వచ్చిన 27 ఏళ్ల సర్ఫరాజ్.. దొరికిన కొన్ని అవకాశాలను బాగానే ఉపయో గించుకున్నాడు. ఫామ్‌లో ఉన్న కరుణ్ నాయర్ కూడా రేసులో ఉన్నాడు. ఇప్పటికే ఆరు టెస్టులు ఆడిన అనుభవం ఉన్న అతడికి సెలక్టర్లు మరో అవకాశం ఇవ్వొచ్చు. ఇషాన్ కిషన్ కూడా రేసులో ఉన్నాడు.

## రోహిత్, కోహ్లి హఠాత్తు రిటైర్మెంట్ వెనక గంభీర్ పాత్ర?




రోహిత్, కోహ్లి హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడంలో కోచ్ గంభీర్ పాత్ర గురించి ఇప్పుడు ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఆస్ట్రేలియా పర్యటన సమయంలోనే వీళ్లిద్దరి రిటైర్మెంట్ గురించి చర్చ జరిగింది. కానీ ఇద్దరూ ఆ ప్రచారాన్ని ఖండించారు. ఇంగ్లాండ్ పర్యటనలో ఆడాలనుకుంటున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దానికి సంబంధించిన సన్నాహాల్లోనే ఉన్నారు. కానీ ఇప్పుడేమో ఒకరి తర్వాత ఒకరు రిటైర్మెంట్ ప్రకటన ఇచ్చేశారు.

బీసీసీఐ ఒత్తిడితోనే వీళ్లు హఠాత్తుగా రిటైరవ్వాల్సి వచ్చిందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంగ్లాండ్ సిరీస్‌తోనే కొత్త టెస్టు ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆరంభం కానున్న నేపథ్యంలో జట్టులోకి కొత్త ముఖాలు కావాలని కోచ్ గంభీర్ బీసీసీఐకి స్పష్టం చేశాడని.. ఈ నేపథ్యంలోనే రోహిత్, కోహ్లిలను కెరీర్‌పై ఓ నిర్ణయం తీసుకోవాలన్న సంకేతాలు ఇచ్చారని.. గత రెండు సిరీస్‌ల్లో ఘోరంగా విఫలమైన నేపథ్యంలో వీళ్లిద్దరూ కొనసాగుతామని గట్టిగా చెప్పలేని స్థితిలో రిటైర్మెంట్ ప్రకటించేశారని భారత క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# సందిగ్ధతకు తెర దించేదెప్పుడు?




సంక్రాంతి పూర్తయిందంటే చాలు సినీప్రియుల దృష్టంతా వేసవి సీజన్‌పైకి మళ్లిపోతుంది. పోటాపోటీగా అగ్ర హీరోల సినిమాలు బాక్సాఫీస్ ముందుకు వరుస కట్టేది.. థియేటర్లలో హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిచ్చేది మళ్లీ అప్పుడే. అయితే ఈ వేసవి అగ్ర తారల మెరుపుల్లేకుండానే చప్పగా ముగియబోతుంది. అలాగని ఇండస్ట్రీలో సినిమాల్లేవని కాదు. చిరంజీవి, ప్రభాస్, పవన్ కల్యాణ్.. ఇలా క్రేజీ ప్రాజెక్టులతో ప్రేక్షకుల్ని ఊరిస్తున్న వాళ్లు చాలా మందే ఉన్నారు. వీరిలో చాలా మంది సినిమాలు ఇప్పటికే ముగింపు దశకు చేరుకున్నాయి. అందులో కొన్ని వేసవి రేసులో సందడి చేయనున్నట్లు ప్రకటనలూ వినిపించాయి.

నిజానికి తొలుత అనుకున్న ప్రణాళిక ప్రకారమైతే చిరంజీవి 'విశ్వంభర' సంక్రాంతి బరిలో సందడి చేయాల్సి ఉంది. కానీ, గ్రాఫిక్స్ పనులు ఆలస్యం కావడంతో వేసవిలో తెరపైకి రావడం పక్కా అనే సంకేతాలందాయి. అయితే ఇప్పటికీ ఆ వీఎఫ్‌ఎక్స్ పనులు ఓ కొలిక్కి రాకపోవడంతో.. చిత్ర బృందం విడుదల తేదీ వినిపించడంలో సందిగ్ధతను కొనసాగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడిది 'ఇంద్ర' విడుదల తేదీ అయిన జులై 24ను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రచారం ఊపందుకుంది. మరి ఆ తేదీనైనా చిత్ర బృందం పక్కా అంటుందా? లేదా ఆగస్టు, అక్టోబరు అంటూ సస్పెన్స్ కొనసాగిస్తుందా? అన్నది తేలాల్సి ఉంది. భారీ బడ్జెట్‌తో సోషియో ఫాంటసీ థ్రిల్లర్‌గా ముస్తాబైన ఈ సినిమాని వశిష్ఠ తెరకెక్కించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రంలోని 'రామ రామ' పాట 25 మిలియన్లకు పైగా వీక్షణలతో ట్రెండింగ్‌లో ఉందని చిత్రవర్గాలు మంగళవారం ప్రకటించాయి.

కథానాయకుడు ప్రభాస్ 'ది రాజాసాబ్' విడుదల విషయంలోనూ కొన్నాళ్లుగా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఏప్రిల్‌లో విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని.. వీఎఫ్‌ఎక్స్ పనుల జాప్యం వల్ల వాయిదా వేసినట్లు చిత్ర బృందం ఆ మధ్య ప్రకటించింది. కానీ, ఇప్పుడు పూర్తి చేయాల్సిన చిత్రీకరణ కూడా చాలానే ఉన్నట్లు ప్రచారం మొదలైంది. దీంతో అసలీ సినిమా ) ఏ దశలో ఉంది.. గ్రాఫిక్స్ పనులు ఎంత వరకొచ్చాయి.. అసలిది ఈ ఏడాది తెరపైకి వస్తుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది.. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న ప్రభాస్ తిరిగి రాగానే.. ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేసేందుకు చిత్ర వర్గాలు సన్నాహాలు చేసుకుంటున్నాయి. మరి ఆ టీజర్‌తో పాటే విడుదల తేదీ విషయంపైనా స్పష్టత ఇస్తారేమో వేచి చూడాలి. రొమాంటిక్ కామెడీ హారర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాకి మారుతి దర్శకత్వం వహిస్తున్నారు.

# ఏపీ ఫైబర్‌నెట్ సంస్కరణ పై ప్రభుత్వం దృష్టి

## వికేంద్రీకరణ విధానంలో సమస్యకు పరిష్కారం
## నిర్వహణకు రూ.1,900 కోట్ల కేంద్ర నిధులు

APSFL Andhra Pradesh State FiberNet Ltd.

**అమరావతి, (విశాఖ సమాచారమ్):-** ఏపీ ఫైబర్‌నెట్‌ను పూర్తి స్థాయిలో సంస్కరించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. రానున్న నాలుగేళ్లలో కనెక్షన్ల సంఖ్యను 50 లక్షలకు పెంచుకోవాలని లక్ష్యంగా నిర్దేశించింది. నెట్‌వర్క్ లైన్ల నిర్వహణను ఈపీసీ విధానంలో ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సుమారు రూ.1,900 కోట్లతో ప్రతిపాదన రూపొందించి, ఈ మొత్తాన్ని కేంద్రం నుంచి సమకూర్చుకోనుంది. దీనికి సంబంధించిన చర్చలు ఇప్పటికే కొలిక్కి వచ్చాయి. త్వరలోనే లైన్ల నిర్వహణ పనులకు టెండర్లు పిలుస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. ఏపీ ఫైబర్ నెట్ పనితీరు సరిగా లేకపోవడం తో కనెక్షన్ల సంఖ్య 9 నుంచి 4.5 లక్షలకు తగ్గింది. ఈ పరిస్థితుల నుంచి సంస్థను గట్టెక్కించడంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. వినియోగదారులకు చౌక ధరకు కేబుల్, నెట్, ల్యాండ్ ఫోన్ సేవలు అందించే లక్ష్యంతో 2016లో ఫైబర్‌నెట్‌ను అప్పటి తెదేపా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బేసిక్ ప్లాన్ కింద రూ.149కి సేవలు అందించింది.

**ప్రైవేటుకు నిర్వహణ పనులు**

భారత్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్ (బీబీఎన్‌ఎల్) రెండు దశల్లో కలిపి సుమారు 81 వేల కి.మీ. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ సంస్థ పరిధిలో ఉంది. ప్రస్తుతం వాటి నిర్వహణను సంస్థ సొంతంగా పర్యవేక్షిస్తోంది. బయట ఉన్న లైన్లతో పాటు వినియోగదారులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడం భారంగా మారింది. ఈ దృష్ట్యా గ్రామాల వరకు ఉన్న ప్రధాన ఆప్టికల్ కేబుల్ నిర్వహణను ఈపీసీ విధానంలో ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదన ప్రకారం కేబుల్ వైర్లు, ఇతర సాంకేతిక సేవలను ప్రైవేటు ఏజెన్సీ నిర్వహిస్తుంది. విశాఖలోని నెట్‌వర్క్ ఆపరేషన్ సెంటర్ (ఎన్‌వోసీ) నుంచి జిల్లా కేంద్రాలకు, అక్కడి నుంచి మండల కేంద్రాలు.. గ్రామాల్లోని సబ్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఆప్టికల్ లైన్ టెర్మినల్ (ఓఎల్‌టీ) వరకు సిగ్నల్ అందించే పనులను ప్రైవేటు సంస్థ పర్యవేక్షిస్తుంది. అక్కడి నుంచి గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, వినియోగదారులకు ప్రసారాలు అందించే పనులకు మాత్రమే ఏపీ ఫైబర్‌నెట్‌ను పరిమితం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త బాక్సులు సమకూర్చడం, వినియోగదారులకు సేవలు మెరుగుపరచడం ద్వారా కనెక్షన్ల సంఖ్యను పెంచుకోవాలన్నది ప్రభుత్వ ఆలోచన.

**గత ప్రభుత్వం మళ్లించిన రూ.450 కోట్లు తిరిగి చెల్లింపు**

బీబీఎన్‌ఎల్ ప్రాజెక్టు కింద ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ఏర్పాటు కోసం అయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరించాలి. దీనికి కేంద్రం విడుదల చేసిన నిధుల్లో రూ.450 కోట్లను వైకాపా ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించింది. ఆ మొత్తాన్ని తిరిగి జమ చేస్తేనే నిర్వహణ ప్రాజెక్టును అనుమతిస్తామని కేంద్రం షరతు పెట్టింది. దీంతో ఆ మొత్తాన్ని సర్దుబాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే వివిధ దశల్లో సుమారు 908 మంది సిబ్బందిని అధికారులు తొలగించారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్, సీఐడీ విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశించింది.

**కేబుల్ ప్రసారాలకు తీవ్ర అంతరాయం**

ప్రస్తుతం సంస్థలో 300 మంది సిబ్బందే ఉన్నారు. సాంకేతిక ఇబ్బందుల కారణంగా ప్రసారాలకు అంతరాయం ఏర్పడితే వెంటనే సరిచేయడం సాధ్యం కావడం లేదు. చాలా చోట్ల ప్రసారాలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో రెండు వారాల్లో 25 వేల మంది వినియోగదారులకు సంస్థకు దూరమయ్యారు. ఇదే పరిస్థితి కొనసాగితే సంస్థపై ఆధారపడి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 6,500 మంది ఆపరేటర్ల పరిస్థితి దయనీయంగా మారుతుందని కేబుల్ ఆపరేటర్ల జేఏసీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'విశాఖలోని ఎన్‌వోసీ సెంటర్ నుంచి సుమారు రెండు గంటలు సిగ్నల్ నిలిచింది. రాష్ట్రం అంతటా ప్రసారాలకు ఇబ్బంది ఏర్పడింది. అధికారుల దృష్టికి సమస్య తీసుకెళదామంటే ఎవరి నుంచీ స్పందన రావడం లేదు' అని జేఏసీ ఛైర్మన్ సీతారామయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యలతో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.


# తెలుగు జాతి సంస్కృతీ వైతాళికుడు
# కొమర్రాజు లక్ష్మణరావు జీవిత సాహిత్య పుస్తక ఆవిష్కరణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** తెలుగు జాతి సంస్కృతీ వైతాళికుడు కొమర్రాజు లక్ష్మణరావు జీవిత సాహిత్య కృషి ని గురించి విజ్ఞాన సర్వస్వ రూపశిల్పి కొమర్రాజు లక్ష్మణరావు శీర్షికన ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు ఆచార్య వెలమల సిమ్మన్న, విజయవాడ ఆంధ్ర లయోల కళాశాల విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు డా. గుమ్మా సాంబశివరావు రచించిన గ్రంథాన్ని ఆంధ్ర విశ్వకళాపరిషత్ హిందీభవన్ లో పద్మభూషణ్ కేంద్ర ప్రభుత్వ హిందీ సలహా మండలి సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు. కొమర్రాజు తెలుగువారు గర్వించదగిన మహా వ్యక్తి అని విజ్ఞాన సర్వస్వమంటే ఏమిటో తెలియని రోజుల్లో ఆ దిశగా ఆలోచించి కృషిచేసి తెలుగు వారికి అపూర్వమైన కానుకలను అందించారని ఈ తరానికి ఆ మహనీయుడి ఘనత తెలియదని ఆ లోటు తీర్చడానికి సిమ్మన్న ,సాంబశివరావులు ఈ అమూల్యమైన గ్రంథం రచించారని పేర్కొన్నారు. రచయితలను అభినందించి సత్కరించారు .గ్రంథ సమీక్ష చేసిన డా.డి.వి సూర్యారావు కొమర్రాజు వారి రచనలను సేకరించి విమర్శనాత్మక దృక్పథంతో ఆయన చరిత్ర గ్రంథాలను , శాస్త్ర రచనలను భాషా శాస్త్ర పరిశోధనను విశ్లేషించి భావితరాలకు ఉపయుక్తమయ్యే రీతిలో ప్రామాణిక గ్రంథం వెలయించారని చెప్పారు .

గౌరవ అతిథి ,ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య బాలమోహన్ దాస్ రచయితలిరువురూ బహుగ్రంథ కర్తలనీ వారి సాహిత్య కృషి నిరుపమానమని , మంచి సాహిత్య కార్యక్రమాలకు యార్లగడ్డ ఎప్పుడూ అండగా ఉంటారని ప్రశంసించారు. కొమర్రాజు లక్ష్మణరావు మనుమడు విశ్రాంతాచార్యులు కొమర్రాజు రవి తమ కుటుంబ విశేషాలను వివరిస్తూ బండారు అచ్చమాంబ ,కొమర్రాజు అచ్చమాంబ డా.కె.ఎల్ రావు కృషిని ప్రస్తావించారు .రచయితలు సిమ్మన్న ,సాంబశివరావులు కృతజ్ఞతా పూర్వకమైన తమ స్పందనలో అరుదైన పుస్తకాలు సేకరించి తమ శక్తి మేరకు గ్రంథాన్ని సమగ్రంగా రూపొందించామని తమ సాహిత్య వ్యాసంగానికి యార్లగడ్డ వారు ఎప్పుడూ ప్రోత్సాహం అందిస్తున్నారని చెబుతూ ఈ పుస్తకం వెలుగులోకి రావడానికి కారకులైన కొమర్రాజు రవి గారికి ధన్యవాదాలు తెలిపారు .లోక్ నాయక్ ఫౌండేషన్ కార్యదర్శి ఆచార్య నల్లా బాబయ్య సభా నిర్వహణకు సారథ్యం వహించారు. సభలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ ఉప కులపతి ఫ్రొ.పి.జార్జ్ విక్టర్, ప్రొ.కొత్త రమేష్, పలువురు ఆచార్యులు ,సాహితీ ప్రముఖులు , పరిశోధకులు పాల్గొన్నారు.

# డ్రోన్లే కాదు.. మిలిటరీ సిబ్బందినీ పంపించి భారత్‌పై విషం కక్కిన తుర్కియే




**ఇంటర్నెట్ డెస్క్:** ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌పై తుర్కియే విషం కక్కిన విషయం తెలిసిందే. భారత్‌పై దాడులు చేసేందుకు పాకిస్థాన్‌కు డ్రోన్లు అందించి సాయం చేసింది. తాజాగా మరో విస్తుగొలిపే విషయం వెలుగులోకి వచ్చింది. డ్రోన్ల సాయమే కాకుండా.. ఇస్లామాబాద్‌కు తుర్కియే తమ సైనిక సిబ్బంది ని కూడా పంపినట్లు వార్తలు వస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ చేపట్టిన దాడుల్లో చనిపోయిన వారిలో ఇద్దరు తుర్కియే సైనికులు ఉన్నట్లు సమాచారం.

పాకిస్థాన్-తుర్కియేల మధ్య వ్యూహాత్మక రక్షణ సంబంధాలు ఇటీవల భారీగా పెరిగాయి. భారత్‌పై దాడికి పాకిస్థాన్.. తుర్కియేకు చెందిన వందల డ్రోన్లను ఉపయోగించింది. అయితే.. వాటి వినియోగంపై అవగాహన కల్పించడానికి తమ మిలిటరీకి చెందిన వ్యక్తులను ఇస్లామాబాద్‌కు తుర్కియే పంపించినట్లు వార్తలు వస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ భారీస్థాయిలో భారత్‌పై డ్రోన్ దాడులు చేసింది. దాదాపు 300 నుంచి 400 డ్రోన్లను ప్రయోగించింది. వాటిని భారత్ కూల్చివేసింది. ఆ శకలాలను ఫోరెన్సిక్ నిపుణులు పరీక్షించారు. అవన్నీ తుర్కియేకు చెందిన 'అసిస్ గార్డ్ సోనగర్' డ్రోన్లుగా ధ్రువీకరించారు.

తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌కు తొలి నుంచీ భారత్ అంటే విపరీతమైన ద్వేషం. ఆ విషయాన్ని అనేక సందర్భాల్లో ఆయన బహిరంగంగా వ్యక్తం చేశారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన తర్వాత ప్రపంచమంతా ఉగ్రవాదుల చర్యలను ఖండిస్తున్న సమయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ఎర్డొగాన్ కలిశారు. ఆ దేశానికి వత్తాసు పలికారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించలేదు సరికదా.. మృతి చెందిన పర్యాటకుల కుటుంబాలకు సానుభూతి కూడా వ్యక్తం చేయడానికి ఆయన ఇష్టపడలేదు.

పహల్గాం ఉగ్ర దాడి జరిగిన తర్వాత ముస్లిం దేశాల్లో తుర్కియే, అజర్ బైజాన్ మాత్రమే పాక్‌కు మద్దతిస్తూ ప్రకటనలిచ్చాయి. కశ్మీర్ అంశంలో గతంలో ఎర్డోగాన్ అనేక సార్లు అంతర్జాతీయ వేదికలపై బహిరంగంగా భారత్‌పై విమర్శలు గుప్పించారు.

# ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశం



**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** ఈనెల 16న రావికమతం మండల సర్వ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపిటిసిలు,గ్రామ సర్పంచ్లు, మండల స్థాయి అధికారులు, అందరూ విధిగా హాజరు కావాలని ఆయన కోరారు. మండలస్థాయి అధికారులు మినహా కిందసాయి అధికారులు ఎవరు హాజరు కాకూడదని, మండల స్థాయి అధికారులు మాత్రమే హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశానికి ఏ ఒక్కరు హాజరు కాకపోయినా అటువంటి వారి పైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అలాగే సభ్యులు అడిగిన ప్రశ్నలకు పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com